


తోటపల్లి పనులు నిలిపివేత అన్యాయం : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - పాలకొండ

ఈ ప్రాంతానికి జీవనాధారణమైన తోటపల్లి పనులు నిలిపివేయడం అన్యాయమని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. మంగళవారం తన స్వగృహంలో మాజీ ఎమ్మెల్యే కళావతితో కలిసి విలేకరులతో మాట్లాడారు. 2009లో అప్పటి ముఖ్యమంత్రి తోటపల్లి ఆధునీకరణ పనులకు పరిపాలన ఆమోదం చేసి శంకుస్థాపన చేయగా 2019లో 9శాతం కూడా పనులు జరగకపోవడంతో ఆ పనులు రద్దు చేయాలని ప్రతిపాదించగా అప్పటి సిఎం రాజశేఖర్ రెడ్డి పనులు పునః ప్రారంభించారన్నారు. అయితే 2024లో కొత్త ప్రభుత్వం వచ్చాక 20 శాతం లోపు పనులన్నీ నిలిపివేస్తున్నట్లు ప్రకటించడం అన్యాయమని అన్నారు. ఆధునీకరణ పనులు వేగవంతంగా ప్రారంభించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమం చేపడతామన్నారు.

కొరత లేదంటూనే కోత

అన్నదాతను యూరియా కష్టాలు వీడడం లేదు. గత వారంలో ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలకు ప్రస్తుతం పంటలకు యూరియా అవసరం అధికంగా ఉంది. రైతు సేవా కేంద్రాల్లో మాత్రం యూరియా నో స్టాక్ అంటూ బోర్డులను దర్శనమిస్తున్నాయి. బహిరంగ మార్కెట్‌లో వ్యాపారులు రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని యూరియాను బ్లాక్‌లో అమ్ముతున్నారు. బస్తా గ్రోమోరు, రైతు సేవ కేంద్రాల్లో రూ. 266 ఉండగా బయట దళారులు రూ.650 వరకు వసూలు చేస్తూ నిలువు దోపిడీ చేస్తున్నారు.

- ఒక రైతుకు ఒక్క బస్తానే
- యూరియా కోసం తప్పని తిప్పలు
- బహిరంగ మార్కెట్ లో అదనంగా రూ.380వసూలు

కురుపాం : మండలంలో యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. యూరియా వేస్తేనే పంటల దిగుబడి ఆశించినంత మేర వస్తుందనే నమ్మకంతో కొనుగోలు చేసేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. మండలంలో 20,684 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతున్నాయి. ఇందులో 8057 ఎకరాల్లో వరి, జొన్న 59 ఎకరాల్లో, 1651 ఎకరాల్లో పత్తి, హార్టికల్చర్ 10917 ఎకరాల్లో సాగవుతుంది. ప్రస్తుతం వరికి యూరియా అవసరముంది. సాధారణంగా ఎకరాకు 3 నుండి 4 బస్తాల యూరియాను వేస్తారు. యూరియా పొలంలో చల్లితేనే పంట దిగుబడి ఆశించినంత మేర వస్తుందని రైతులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం యూరియా కొరత వల్ల ఒక బస్తా కూడా చల్ల లేకపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం సాగు చేసిన పంటలకు 700 మెట్రిక్ టన్నులు అవసరం కాగా, కేవలం ప్రస్తుతం 404 మెట్రిక్ టన్నులు మాత్రమే రైతు సేవా కేంద్రాల్లో పంపిణీ చేశారు. ఇంకా 296 మెట్రిక్ టన్నులు యూరియా అవసరముంది. డిఎపి 320 మెట్రిక్ టన్నుల అవసరము కాగా, కేవలం 168 మెట్రిక్ టన్నులు మాత్రమే రైతు సేవా కేంద్రాల్లో పంపిణీ చేశారు. ఇంకా 152 మెట్రిక్ టన్నులు అవసరం ఉంది.



యూరియా కోసం గ్రోమోర్ దుకాణం వద్ద నిరీక్షిస్తున్న రైతులు

రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుని కొందరు వ్యాపారులు బ్లాక్ మార్కెట్లో రూ.266కు యూరియా బస్తాను రూ.650 వరకు అమ్ముతూ రైతులను నిలువుదోపిడీ చేస్తున్నారు. యూరియా కోసం గిరిజన గ్రామాల నుంచి రైతులు కురుపాం, చినమేరంగి, పెదమేరంగి తదితర ప్రాంతాలకు వెళ్లి కొనుగోలు చేసి వ్యయ ప్రయాసలు పడి దొరికిన కాడికి తెచ్చుకొని పంటలను కాపాడుకుంటున్నామని రైతులు వాపోతున్నారు. యూరియా కావాలని దుకాణాల వద్దకు వెళ్తే అదనంగా మరొక కాంప్లెక్స్ ఎరువును కొనుగోలు చేస్తేనే ఇస్తామని కొందరు వ్యాపారులు చెబుతున్నారు. మండలంలో సాగు చేసిన పంటలకు కావాల్సిన యూరియాను సరఫరా చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

యూరియా వేస్తేనే పంటకు బలం

వరికి యూరియా చల్లడం వల్లే పంటకు ప్రయోజనం. ఎకరాకు నాలుగు బస్తాల యూరియా మొదటి విడతలో చల్లాలి. కానీ ప్రస్తుతం యూరియా దొరకక చాలా అవస్థలు పడుతున్నాం. ప్రభుత్వం యూరియాను సరిపడా సరఫరా చేసి రైతులను ఆదుకోవాలి.

బొమ్మి మురళి,
రైతు, కస్పా గదబవలస, కురుపాం మేజర్ పంచాయతీ.

మా అమ్మ వస్తేనే యురియా ఇస్తారట

మాది గుమ్మడిగూడ పంచాయతీలో గల గోలవలస. మూడు ఎకరాలు సాగు చేస్తున్న భూమి అంతా కూడా మా అమ్మ పేరునే ఉంది. మా అమ్మ మంచానికే పరిమితమైంది. ఆమె వచ్చి బయోమెట్రిక్ వేస్తేనే ఇస్తామంటున్నారు. ఇలా అయితే మేం వ్యవసాయం చేయాలో? మానుకోవాలో మాకే అర్థం కావడం లేదు.

శెట్టి రాంబాబు,
రైతు, గోలవలస , కురుపాం మండలం.

200 మెట్రిక్ టన్నుల యురియా రావాల్సి ఉంది

ఇప్పటి వరకు 404 మెట్రిక్ టన్నులు యూరియా, డిఎపి 168 మెట్రిక్ టన్నులు వచ్చింది. మండలంలో అన్ని రైతు సేవా కేంద్రాల్లో నిల్వ ఉంచి రైతులకు అందజేశాం. ఇంకా 200 మెట్రిక్ టన్నులు యురియా, 30 మెట్రిక్ టన్నులు డిఎపి రావలసి ఉంది. అది కూడా కొద్ది రోజుల్లో వస్తుంది. రైతులకు ఎక్కడా ఇబ్బందులేకుండా యూరియా, డిఎపి అందజేస్తున్నాం.

కె. నాగేశ్వరరావు
మండల వ్యవసాయ శాఖ అధికారి, కురుపాం.



రైతులకు సర్దిచెబుతున్న వ్యవసాయశాఖాధికారులు

యూరియా కోసం రోడ్డెక్కిన అన్నదాతలు

వీరఘట్టం : వ్యవసాయ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల సకాలంలో మండలానికి యూరియా రాకపోవడంతో స్థానిక మార్కెట్ యార్డ్ ఎదురుగా మంగళవారం అన్నదాతలు యూరియా కోసం రోడ్డెకాల్సిన పరిస్థితి ఏర్పడింది. రైతు సేవా కేంద్రాల ద్వారా సకాలంలో యూరియా రాదు. ప్రైవేట్ డీలర్ల వద్ద యూరియా కొనుగోలు చేద్దామన్నా అందుబాటులో లేకపోవడంతో యూరియా కోసం ప్రతిరోజు రైతులు వేయి కళ్లతో ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అన్నదాతలు రోడ్డుపై ఆందోళన చేపట్టడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. విషయం తెలుసుకున్న పోలీసులు, వ్యవసాయ అధికారులు అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడి నచ్చుజెప్పారు. మూడు రోజులు ఓపికపడితే మండలానికి 20 టన్నుల యూరియా వస్తుందని, ప్రతి ఒక్కరికీ పంపిణీ చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన కార్యక్రమాన్ని విరమించారు.

నాణ్యమైన పరిష్కామంటే ఏమిటో?

నెలలు గడుస్తున్నా తీరని సమస్యలు

వ్యయ ప్రయాసల కోర్చి కలెక్టర్ గ్రీవెన్స్‌కు బాధితులు


ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న గ్రీవెన్స్ సెల్‌కు సగటున ప్రతివారం వందకు పైగా వినతులు అందుతున్నాయి. వీటిలో ఎక్కువగా భూసమస్యలు, సంక్షేమ పథకాలకు సంబంధించిన సమస్యలపైనే వస్తున్నాయి. జిల్లా నలుమూలల నుంచి అనేక సమస్యల్ని పరిష్కరించాలని కోరుతూ నిరుపేదలు ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి కలెక్టర్ గ్రీవెన్స్ సెల్‌కు వస్తున్నారు. ఎన్నో ఆశలతో వినతులు అందజేస్తున్నారు. జిల్లాకు బాస్ అయిన కలెక్టర్‌కు తమ సమస్య చెప్పుకుంటే వెంటనే పరిష్కారమవుతుందని కోటి ఆశలతో వస్తున్న బాధితులకు నాణ్యమైన పరిష్కారం అనేది దొరకడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యం భూ సమస్యల పరిష్కారానికి అందుతున్న వినతులకు స్పష్టమైన, నాణ్యమైన పరిష్కారం తొందరగా దొరకడం లేదు. అదే విధంగా ఏడాదిన్నర కాలంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు సంబంధించి వస్తున్న వినతులకు కూడా నాణ్యమైన పరిష్కారం లభించడం లేదు. తల్లికి వందనం పథకం కింద డబ్బులు పడలేదని ఇంతవరకు జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్ సెల్‌లో వందల సంఖ్యలో వినతులు అందాయి. ఇప్పటికీ అందుతూనే ఉన్నాయి. రకరకాల తప్పుడు కారణాలు చూపించి అనేకమంది నిరుపేద విద్యార్థులకు తల్లికి వందనం పథకాన్ని దూరం చేశారు. అలాగే అన్నదాత సుఖీభవ పథకం కింద డబ్బులు పడలేదని రైతుల నుంచి దరఖాస్తులు అందుతున్నాయి. కానీ వీటి పరిష్కారం కనుచూపు మేరలో కనిపించడం లేదు. వారం వారం నిర్వహిస్తున్న గ్రీవెన్స్ సెల్ లో అధికారుల నుద్దేశించి జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపించాలని కోరుతున్నారు. కానీ కిందిస్థాయిలో ఆ పరిస్థితి లేదు. వీరు తమ సమస్యలపై పలుమార్లు అర్జీలను అందజేసినా పరిష్కారం కాలేదు.

7సార్లు వినతి ఇచ్చా

భూసమస్య పరిష్కారానికి ఏడు సార్లు వినతి పత్రం అందజేశా. ఇంతవరకు పరిష్కారానికి నోచుకోలేదు. మండల రెవిన్యూ అధికారులకు కూడా సమస్య పరిష్కారానికి వినతులు అందజేశా. నాకు 83 ఏళ్ళ వయసు. ఈ వయసు లోనూ ఆఫీసుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది.

నీరస పోలి నాయుడు,నిమ్మలపాడు,
కొమరాడ మండలం



ఏడోసారి వినతి ఇస్తున్న పోలినాయుడు

తల్లికి వందనం పడలేదు

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాం. తల్లికి వందనం డబ్బులు మంజూరు కాలేదు. కళాశాలలో చాలా మందికి పడ్డాయి. మాకు పడలేదు. దీనిపై ఫిర్యాదు చేసినా పరిష్కారం కాలేదు.

ఇజ్జాడ శ్యామల, పిట్టా మాలతి,
సీతానగరం

భూములు అప్పగించలేదు

మాది పెద్ద గెడ్డ నిర్వాసిత గ్రామం. పునరావాస కార్యక్రమంలో భాగంగా తమకు భూములిచ్చారు. కానీ రెవెన్యూ అధికారులు ఆ భూములను ఇంతవరకు అప్పగించలేదు. ఎన్నిసార్లు విపతులిచ్చినా ఫలితం కనిపించడం లేదు. భూములున్నా ప్రభుత్వ పథకాలు అందడం లేదు.


గిరిజన మహిళలు,
మడవలస,పాచి పెంట మండలం

ట్రంప్ సుంకాలతో వ్యవసాయరంగ సంక్షోభం

ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కృష్ణమూర్తి

ప్రజాశక్తి - పాచిపెంట

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ భారతదేశంపై విధించిన సుంకాల వల్ల మనదేశ రైతాంగం తీవ్ర సంక్షోభానికి గురవుతుందని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి అన్నారు. స్థానిక కమ్యూనిటీ భవనం వద్ద రైతు సంఘం మండల అధ్యక్షులు మాదిరెడ్డి తిరుపతి నాయుడు ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన సదస్సులో కృష్ణమూర్తి మాట్లాడారు. పత్తి దిగుమతిపై మన దేశం నుంచి అమెరికాకు దిగుమతి అయ్యే పత్తిపై 50శాతం దిగుమతి పన్ను విధించడం దుర్మార్గమన్నారు. మరోవైపు నరేంద్ర మోడీ ప్రభుత్వం అమెరికా నుంచి పత్తి దిగుమతిపై ఉన్న 11 శాతం పన్నును సున్నాకు తగ్గించడం వల్ల అమెరికా నుంచి మన దేశంలో పండిన పత్తి పంటను వ్యాపారులు కొనక ప్రభుత్వం సేకరించక ధరలు లేక రైతాంగం తీవ్ర నష్టానికి గురవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా ఒక పత్తిపైనే కాకుండా 13 రకాల వ్యవసాయ పంటలపై ట్రంప్ విధించిన దిగుమతి పన్నులకు వ్యతిరేకంగా ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. పాడి రైతులు కూడా తీవ్రంగా నష్టపోతారన్నారు. అంతేకాకుండా గార్మెంట్స్, బట్టల కంపెనీల్లో పని చేసే కార్మికులు, ఉద్యోగులు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో అమెరికాకు మోడీ లొంగిపోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కావున రైతాంగమంతా సంఘటితమై పెద్ద ఎత్తున కదిలి అమెరికా బెదిరింపులకు లొంగకుండా రైతులకు, దేశానికి అండగా నిలబడేలా మోడీ ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి బోను గౌరు నాయుడు, ఉపాధ్యక్షులు బూర పాపయ్య, లంకేనా రామ్మూర్తి, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు జర్నీ రామయ్య, సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు పాల్గొన్నారు



సదస్సులో మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి



మారథాన్ ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్, జిల్లా అధికారులు

వైసిపి ఆధ్వర్యాన అన్నదాత పోరు

డిఆర్ఒ కార్యాలయంలో వినతి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ఎరువులను బ్లాక్ చేసి అధికారులకు విక్రయించడంతో ఎరువుల కోసం రైతులు గత కొన్ని నెలలుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అన్నదాతకు అండగా నిలిచే కార్యక్రమంలో భాగంగా మంగళవారం అన్నదాత పోరు కార్యక్రమం పార్వతీపురంలో జిల్లా వైసిపి అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజు అధ్యక్షతన, మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు సారథ్యంలో వందలాది మంది వైసిపి శ్రేణులు, రైతులతో కలిసి నిర్వహించారు. తొలుత వైఎస్ఆర్ విగ్రహనికి పూలమాలలు వేసి నివాళులర్పించి, అక్కడి నుంచి ర్యాలీ నిర్వహించి ఆర్డీవో కార్యాలయం వద్దకు చేరుకుని అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. అయినా వైసిపి నాయకులు వెనుకడుగు వేయకుండా తమ నిరసనను తెలియచేసి ర్యాలీని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా పరీక్షిత్‌రాజు, రాజన్నదొర, జోగారావు యూరియా, ఎరువుల కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే చంద్రబాబు ప్రభుత్వం మొద్దునిద్రపోతోందని విమర్శించారు. ఆ సమస్యలను రైతులతో కలిసి అధికారుల దృష్టికి తీసుకెళ్లడానికి వైసిపి రాష్ట్రవ్యాప్తంగా ఆర్‌డిఒలకు వినతిపత్రాలిచ్చే కార్యక్రమం చేపట్టామని, తెలిపారు. రైతులు సంక్షోభంలో ఉంటే ముఖ్యమంత్రికి గానీ, వ్యవసాయశాఖ మంత్రికి చీమకుట్టినట్లయినా లేదన్నారు. మార్క్ ఫెడ్ కు ఇవ్వాల్సిన 50శాతం ఎరువులను తగ్గించి, ప్రైవేటుకు కేటాయించడం అత్యంత దుర్మార్గమన్నారు. రైతులకు అవసరమైన ఎరువులను వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ డిమాండ్‌చేశారు. యూరియాతో సహా ఎరువుల కొరత లేకుండా చూడాలని, రైతుల చెంతకే వాటిని చేర్చాలని, బ్లాక్ మార్కెట్ ను నియంత్రించాలని, ఎరువులను పక్కదోవ పట్టిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని, వర్షాలకు దెబ్బతిన్న ప్రాంతాల రైతులకు వెంటనే ఇన్ పుట్ సబ్సిడీ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం డిఆర్ఒ కార్యాలయ ఎఒకు వినతిని అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైఎస్ చైర్మన్ మరిశర్ల బాపూజీ నాయుడు, వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు బలగ శ్రీరాములు నాయుడు, మున్సిపల్ చైర్ పర్సన్ బోను గౌరీశ్వరి, ఎంపిపి మజ్జి శోభారాణి, జడ్పీటీసీలు అలజంగి రవికుమార్, మామిడి బాబ్జీ, పట్టణ, మండలాల పార్టీ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, పాలవలస మురళీకృష్ణ, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి పోల సత్యనారాయణ, జిల్లా పార్టీ ప్రతినిధులు, వివిధ నియోజకవర్గాల ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.



డిఆర్ఒ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న వైసిపి జిల్లా అధ్యక్షులు పరీక్షిత్‌రాజు, నాయకులు రాజన్నదొర, జోగారావు

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

మారథాన్ 5కె రెడ్ రన్‌లో కలెక్టర్ పిలుపు

ప్రజాశక్తి పార్వతీపురం టౌన్

ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన చెందాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. హెచ్ఐవి/ఎయిడ్స్, మాదకద్రవ్య దుర్వినియోగం పట్ల యువతలో అవగాహన పెంపొందించేందుకు యూత్ ఫెస్ట్-%2025 ఐఇసి మారథాన్ 5కె రెడ్ రన్ కార్యక్రమం మంగళవారం దిశ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని క్రీడా జ్యోతిని వెలిగించి, జెండా ఊపి 5కె రన్‌ను లాంఛనంగా ప్రారంభించారు. స్థానిక ఎస్‌వి డిగ్రీ కాలేజీ వద్ద ప్రారంభమైన రన్ 4 రోడ్ల జంక్షన్ మీదుగా కలెక్టర్ కార్యాలయం వరకు జరిగింది. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ హెచ్ఐవి/ఎయిడ్స్ ప్రధానంగా రక్షణలేని లైంగిక సంబంధాలు, రక్తమార్పిడి, వాడిన సిరంజీల వినియోగం ద్వారా వ్యాప్తి చెందుతుందన్నారు. కావున ప్రతి ఒక్కరూ అవగాహనతో ఉండి జాగ్రత్తలు పాటించడం ద్వారా దీన్ని అరికట్టవచ్చని తెలిపారు. జిల్లాస్థాయిలో మూడు విభాగాల్లో (17- 25 ఏళ్ల మధ్య గల స్త్రీ, పురుషులు, ట్రాన్స్ జెండర్స్) జరిగిన ఈ పరుగు పందెంలో గెలుపొందిన విజేతలు రాష్ట్ర స్థాయిలో జరగనున్న పోటీలకు హాజరుకానున్నట్లు చెప్పారు. జిల్లా లెప్రోసి, ఎయిడ్స్, హెచ్ఐవి, టిబి నియంత్రణ అధికారి డాక్టర్ ఎం.వినోద్ కుమార్ మాట్లాడుతూ యువతలో హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాప్తి, ఇతర వ్యాధుల ప్రభావం పట్ల అవగాహన కల్పించడం కోసం మారథాన్ రన్, క్విజ్ పోటీలు, వివిధ ప్రాంతాల్లో ఐఇసి ప్రోగ్రాంలు నిర్వహిస్తున్నామన్నారు. యువత చురుగ్గా వీటిపై చర్చించి అవగాహన పెంచుకోవాలని కోరారు. మారథాన్‌లో పురుషుల విభాగంలో బి.సాయి ప్రథమ, ఎం.అజయ్ ద్వితీయ బహుమతి గెలుచుకున్నారు. మహిళల విభాగంలో పి.అరుణ ప్రథమ, బి.స్పందన ద్వితీయ స్థానాలను సాధించారు. ట్రాన్స్‌జెండర్ విభాగంలో బి.చిన్ని ప్రథమ, బి.ప్రశాంత్ ద్వితీయ బహుమతి దక్కించుకున్నారు. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.10 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.7 వేలు, క్విజ్ కాంపిటీషన్ విజేతలు ప్రథమ స్థానంలో ఎం.మౌనిక వైష్ణవి , బి. వాసు, ద్వితీయ స్థానంలో బి.భువనేశ్వరి, పి.కుమారి, తృతీయ స్థానంలో పి.మమాలి, టి.భవ్యశ్రీకు కలెక్టర్ చేతుల మీదుగా నగదు బహుమతి, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమం లో ఎఆర్టీ అధికారి డా.ఫణీంద్ర, దిశ సి.పి.ఎం కె.వి.ఆర్ శైలజ, డిఎస్‌డిఒ క్టర్ శ్రీధర్, దిశ టీం జి.అమ్మినాయుడు, జి.కోటేశ్వరరావు, వివిధ కళాశాలల విద్యార్థినీ విద్యార్థులు, ఎన్జీఒలు, ఎన్ఎసీపీ ఫెసిలిటీ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు

అడుగడుగునా ఆంక్షలు

పాలకొండ : రైతులు పడుతున్న యూరియా ఇబ్బందులపై రైతు పోరు కార్యక్రమం మంగళవారం వైసిపి తలపెట్టగా దానికి పోలీసులు అడుగడుగునా ఆంక్షలు విధించారు. కార్గిల్ పాయింట్ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయాలకు ర్యాలీగా వెళ్లి అక్కడ నిరసన చేపట్టడానికి అనుమతి ఇవ్వలేదు. చుట్టుపక్క ప్రాంతాల నుంచి నాయకులను, కార్యకర్తలను రాకుండా పోలీసులు ముందుగా అడ్డుకున్నారు. ర్యాలీగా వెళ్లొద్దంటూ హెచ్చరించారు. అయినప్పటికీ యాలం జంక్షన్ నుంచి మాజీ మంత్రి పుష్ప శ్రీవాణి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే విశ్వసరాయి కళావతి తదితరులు వెళ్ళగా సబ్ కలెక్టర్ కార్యాలయానికి 100 మీటర్ల దూరంలో సిఐ ప్రసాదరావు, ఎస్సై ప్రయోగమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు అడ్డుకున్నారు. కేవలం పది మంది మాత్రమే వినతిపత్రం ఇవ్వాలని సూచించారు. దీంతో సబ్ కలెక్టర్ ఎఒ సావిత్రికి వినతిని అందించారు. కార్యక్రమంలో వీరఘట్టం ఎంపిపి డి.వెంకటరమణ, జెడ్‌పిటిసి సభ్యులు జంపు కన్నతల్లి, పాలకొండ మండల, పట్టణ వైసిపి కన్వీనర్లు కె.సూర్యప్రకాష్ వెలమల మన్మధరావు, నాయకులు పాలవలస ధవళేశ్వరరావు, లిల్లీ పుష్పనాధం, కోరాడ సూర్యనారాయణ, కె.విజయ్ కుమార్ ౹ ఉన్నారు.

సీతానగరం: రైతులకు సకాలంలో యూరియా సరఫరా చేయాలని పార్వతీపురంలో జరిగే నిరసన కార్యక్రమానికి వెళ్లేందుకు సిద్ధంగా ఉంటే అక్రమ అరెస్టులు, గృహనిర్బంధాలకు పాల్పడడం నిరంకుశ చర్య అని జెడ్‌పిటిసి సభ్యులు ఎం.బాబ్జీ, గాజులవలస సర్పంచి బి.తిరుపతిరావు అన్నారు. పార్వతీపురంలో ధర్నా కార్యక్రమానికి వెళ్తున్న వైసిపి కార్యకర్తలను జనహిత స్కూల్ వద్ద సీతానగర ఎస్సై ఎం రాజేష్ ఆధ్వర్యంలో అడ్డుకున్నారు. దీన్ని నిరసిస్తూ రోడ్డు మీద నిరసన చేపట్టారు.

కొమరాడ : రైతులకు ఎరువులు పూర్తిస్థాయిలో అందించి అన్నిలా ఆదుకోవాలని కోరుతూ అన్నదాత పోరు కార్యక్రమానికి వెళ్తున్న నాయకులను ముందే అరెస్టు చేయడం దారుణమని వైసిపి జిల్లా అధికార ప్రతినిధి మరడాన సింహాచలం నాయుడు అన్నారు. మండలంలోని వైసిపి ముఖ్య నాయకుల ఇంటికి వచ్చి పోలీసులు అరెస్ట్ చేయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. మంగళవారం తెల్లవారుజామునకే వైసిపి జిల్లా యువజన విభాగం అధ్యక్షులు నంగి రెడ్డి శరత్‌బాబు ను ఇంటి వద్దనే పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు.

నిరసనకు రాకుండా అడ్డుకున్న పోలీసులు



సీతానగరం : పోలీసులు అడ్డుకోవడంతో నిరసిస్తూ ఆందోళన చేస్తున్న వైసిపి నాయకులు

సాలూరు రూరల్ : పార్వతీపురం ఆర్‌డిఒకార్యాలయం వద్ద తలపెట్టిన నిరసన కార్యక్రమానికి బయలుదేరుతున్న మండల వైసిపి నాయకులను గృహనిర్బంధం చేయడం ఎంతవరకు న్యాయమని వైస్ ఎంపిపి రెడ్డి సురేష్‌కుమార్, వైసిపి జిల్లా కార్యదర్శి దండి శ్రీనివాసరావు ఆక్షేపించారు. స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇలాగే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వైసిపి ఆధ్వర్యంలో రైతులందర్నీ కలుపుకొని భారీ ఎత్తున ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపడతామని వారు ప్రభుత్వానికి హెచ్చరించారు.

మాజీ ఎమ్మెల్యే కళావతిని నిర్బంధించిన పోలీసులు

వీరఘట్టం : పాలకొండలో నిర్వహించిన అన్నదాత పోరుబాటకు హాజరుకాకుండా మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతిని మండలంలోని వండవలో పోలీసులు నిర్బంధించారు. ఈ సందర్భంగా కళావతి మాట్లాడుతూ నిర్బంధాలు, అరెస్టుల ఆందోళన కార్యక్రమాలు ఆపలేరని, రైతు సమస్యలు పరిష్కరించే వరకు పోరాటాలు చేస్తామని అన్నారు.

రమేష్‌కు డిడిగా ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి, సహాయ సంచాలకులు లోచర్ల రమేష్ డిప్యూటీ డైరెక్టర్ (డీడీ)గా ఉద్యోన్నతి పొందారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత నెలలో జరిగిన శాఖాపరమైన పదోన్నతుల కమిటీ (డీపీసీ)లో రమేష్‌కు ఉద్యోగోన్నతి కల్పించారు. రమేష్ కు డిప్యూటీ డైరెక్టర్‌గా ఉద్యోగోన్నతి రావడంపై సమాచార పౌర సంబంధాల శాఖ అధికారులు, సిబ్బంది, సన్నిహితులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.



రోగులకు మెరుగైన సేవలు అందించాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

వివిధ రకాల వ్యాధులతో వస్తున్న రోగులకు మెరుగైన సేవలందించాలని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి వైద్య సిబ్బందికి సూచించారు. జియ్యమ్మవలస మండలం చినమేరంగి సామాజిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్‌పర్సన్ :గా పాల్గొన్నారు. తొలుత రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. నిరంతరం ఆసుపత్రిలో ఉంటూ రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని సిబ్బందికి సూచించారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. పాము కాటు, మలేరియా, డెంగీ వ్యాధులకు సంబంధించిన మందులు అందుబాటులో ఉంచాలని అన్నారు. ఆసుపత్రికి ప్రహరీ, పోస్టుమార్టం రూం, ఆసుపత్రి ఆవరణంలో విద్యుత్తు దీపాలు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని ఆసుపత్రి కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో డిసిహెచ్ఎస్ జి.నాగభూషణరావు, జియమ్మవలస ఎంపిపి బొంగు సురేష్, అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు, వైద్యులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ట్రాక్ పనులతో నిలిచిపోయిన వాహనాలు

ట్రాక్ మరమ్మత్తు పనులతో వాహనచోదకులకు ఇబ్బందులు

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని గల రైల్వే గేట్లతో ఇప్పటికే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న సమయంలో ట్రాక్ మరమ్మత్తు పనులతో వాహనదారులు మరిన్ని ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం మధ్యాహ్నం 12 గంటల సమయం నుంచి అర్తాం రైల్వే గేటు వద్ద ట్రాక్ మరమ్మత్తు పనులు రైల్వే అధికారులు ప్రారంభించారు. దీంతో ట్రాఫిక్ తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఒడిశా నుంచి ఆంధ్రాలోకి వచ్చే వాహనాలతో పాటు ఆంధ్రా నుంచి ఒడిశా వైపు వెళ్లే వాహనాలు భారీగా నిలిచిపోయాయి. సుమారు రెండువైపులా కిలోమీటర్ మేర ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ఈ సమయంలో ఆటోలు ద్విచక్ర వాహనదారులు ఎండలో రోడ్డుపై తీవ్ర అవస్థలు పడ్డారు. దూరప్రయాణాలు చేసే ప్రయాణికులు ట్రాఫిక్ జామ్‌లో ఇరుక్కుపోయి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రైల్వే ట్రాక్ మరమ్మత్తు పనులు అధికారులు రాత్రి సమయంలో చేసుకుంటే ఇంత ట్రాఫిక్ ఇబ్బంది ప్రయాణికులకు లేకుండా ఉండేవని పలువురు ప్రయాణికులు అంటున్నారు. ఇకపై వాహనదారులకు, ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా ఉండేలా రైల్వే ట్రాక్ మరమ్మత్తు పనులు చేపట్టాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.

బైపాస్ రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు

'ప్రజాశక్తి' వార్తకు స్పందన

ప్రజాశక్తి -పార్వతీపురంటౌన్

స్థానిక బైపాస్ రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్నామని ఆర్ అండ్ బి ఎఇఇ బి.రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. 'ప్రజాశక్తి'లో ఇటీవల ప్రచురితమైన అధ్వానంగా బైపాస్ రోడ్డు అన్న వార్తకు స్పందించి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు బైపాస్ రోడ్డు దెబ్బతిన్నదని, ఇరువైపులా కాలువలు లేనందున వర్షపు నీరు ఒకే చోట నిలిచిపోవడంతో రహదారి మరింత తీవ్రంగా దెబ్బతిందని అన్నారు. రహదారి పునరుద్ధరణకు రూ.300 లక్షలకు కేటగిరి-సిలోను, మరమ్మతులు నిమిత్తం రూ.15లక్షలకు కేటగిరి-బి లో కోరినట్టు చెప్పారు. ప్రస్తుతం తాత్కాలిక మరమ్మతు పనులు చేపడుతున్నామని తెలిపారు.



కాలువలో మురుగునీరు తొలగించిన అధికారులు

కాలువలో మురుగు తొలగింపు

'ప్రజాశక్తి' వార్తకు స్పందన

ప్రజాశక్తి - సాలూరురూరల్

మండలంలోని మామిడిపల్లిలో గత కొన్ని రోజులుగా మురుగు నీరు నిల్వతో గ్రామంలో ఎక్కడ చూసిన జ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై 'సోమవారం' ప్రజాశక్తిలో ప్రచురితమైన పడకేసిన పారిశుధ్యం అన్న వార్తకు అధికారులు స్పందించారు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శి గ్రామంలో మురుగుతో ఉన్న కాలువలను పరిశుభ్రపరిచారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఇలాగే వర్షాకాలం ప్రారంభంలో చేసినట్లయితే గ్రామంలో ఎటువంటి జ్వరాలు, ఇతర ఇబ్బందులు వచ్చేవి కావని, ఇప్పటికైనా స్పందించి ఎప్పటికప్పుడు గ్రామంలో మురుగు కాలువల్లో నిల్వలు పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

శక్తి యాప్‌పై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, డిగ్రీ కాలేజీ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం శక్తి యాప్‌పై ఎస్ఐ లంక శ్రీనివాసరావు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా భద్రత కోసం శక్తి యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందని, కావున ప్రతి ఒక్కరూ మొబైల్‌లో శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసుకునేలా విద్యార్థులు వారి తల్లిదండ్రులకు, గ్రామాల్లో అవగాహన కల్పించాలని తెలిపారు. అంతేకాకుండా అత్యవసర సమయంలో శక్తి యాప్ నెంబర్ 112కు కాల్ చేయాలని అలా అయితే ఆపదలో ఉన్న మహిళలకు పోలీసులు నుంచి వెంటనే రక్షణ కలుగుతుందని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డిప్యూటీ డిఎంహెచ్ఒ విజయపార్వతి

హైరిస్క్ కేసులపై ప్రత్యేక దృష్టి : డిప్యూటీ డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - వీరఘట్టం

హైరిస్క్ కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని డిప్యూటీ డిఎంహెచ్ఒ ఎస్.విజయ పార్వతి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం మండలంలోని బిటివాడ పిహెచ్‌సిని సందర్శించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. పిఎంఎస్ఎంఎ కార్యక్రమంలో భాగంగా వైద్య తనిఖీలకు వచ్చిన గర్భిణీలతో మాట్లాడారు. ప్రసవం సమయం వరకు కూడా జాగ్రత్తలు పాటించాలని, వైద్యాధికారులు ఇచ్చే సలహాలు, సూచనలు పాటించి ఆరోగ్యంగా ఉండాలన్నారు. పౌష్టికాహారం ఎక్కువగా తీసుకోవాలని, మీరు ఆరోగ్యంగా ఉంటే పుట్టబోయే బిడ్డ కూడా ఆరోగ్యంగా ఉంటుందని, ఆ దిశగా జాగ్రత్తలు పాటించాలన్నారు. అనంతరం గర్భిణుల గుర్తింపు కార్డులను పరిశీలించారు. ఈమెతో పాటు స్థానిక వైద్యాధికారి ఎ.మానస, వైద్య సిబ్బంది ఉన్నారు.

ఆది కర్మయోగి అభియాన్‌తో గిరిజన గ్రామాలు అభివృద్ధి

ప్రజాశక్తి - కొమరాడ

ఆది కర్మయోగి అభియాన్ పథకంతో గిరిజన గ్రామాలు శాతం అభివృద్ధి చెందుతాయని ఎంపిడిఒ ఎస్.రమేష్ అన్నారు. మండలంలోని చినకెర్లం, బట్టిమేగవలస గ్రామాల్లో ఆది కర్మయోగి అభియాన్ కార్యక్రమంలో భాగంగా తొలుత గ్రామ పురవీధుల్లో ర్యాలీ చేసి వీధుల్లో ఉన్న సమస్యలను గుర్తించి అనంతరం గ్రామసభ ఏర్పాటు చేశారు. గ్రామంలో సమస్యలను గుర్తించి అనంతరం గ్రామసభలో మండల అధికారుల బృందం గుర్తించిన వివిధ పనులను రోడ్లు, కాలువలు, ప్రహరీ గోడలు, బరియల్ గ్రౌండ్ రోడ్లు, ఇళ్ల నిర్మాణాలు, పెన్షన్ గల వివిధ రకాల 23 వరకు గుర్తించిన పనులను చదివి వినిపించి, పెండింగ్ విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆది కర్మయోగి అభియాన్ అనేది ఒక ఉద్యమమని, దీని లక్ష్యం గిరిజన ప్రాంతాల్లో పాలన, సేవా పంపిణీ, అభివృద్ధిని మెరుగుపరుచుతుందని తెలిపారు. ప్రభుత్వ పథకాలను, ముఖ్యంగా గిరిజన వర్గాలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎపిఒ భాను, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ గౌరీశంకర్, డిప్యూటీ ఎంపిడిఒ రాధాకృష్ణ, సచివాలయ సిబ్బంది, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ శారదాంబ, ఎన్జిఒ సంఘ నాయకులు, ఉద్యోగులు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కురుపాం

ప్రకృతి వ్యవసాయంపై గిరిజన రైతులు అవగాహన పెంచుకోవాలని, అలాగే వీలైనంత వరకు సేంద్రియ ఎరువులను వినియోగించుకోవాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ రైతులకు పిలుపునిచ్చారు. మండలంలోని ఉదయపురాన్ని కలెక్టర్ మంగళవారం సందర్శించారు. అక్కడి రైతులతో ముఖాముఖిలో పాల్గొన్న ఆయన అధిక మోతాదులో ఎరువుల వినియోగం వల్ల పంటకు, ఆరోగ్యానికి హానికరమన్నారు. కావున నిర్దేశించిన మోతాదులోనే యూరియాను వినియోగించాలని, ఈ విషయాన్ని రైతులు గ్రహించాలని సూచించారు. అధిక యూరియా వినియోగానికి బదులుగా నానో, ఇతర జీవన ఎరువులను వినియోగించుకోవాలని పేర్కొన్నారు. నానో యూరియా, డిఎపిని వినియోగించడం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించవచ్చని తెలిపారు. నానో యూరియా, డిఎపి అందరికీ అందుబాటులో ఉన్నాయని, అవసరం మేరకు వాటిని వినియోగించాలని రైతులను కోరారు. ఈ సందర్భంగా నానో యూరియా, డిఎపిని రైతులకు కలెక్టర్ పంపిణీ చేశారు. అనంతరం అదే గ్రామంలోని ఆశ్రమ పాఠశాలను సందర్శించిన ఆయన అక్కడి విద్యార్థినిలతో ముచ్చటించారు. కాసేపు అధ్యాపకుడిగా మారి విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించారు. పాఠశాలలో మౌలిక వసతులు లోటు ఉండరాదని, ఎల్లవేళలా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. అక్కడి నుంచి గుమ్మిలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు గురించి వివరించారు. ఈ సందర్భంగా శిబిరానికి విచ్చేసిన రోగులకు కాల్షియం, ఇతర టాబ్లెట్లను కలెక్టర్ పంపిణీ చేశారు. తదుపరి మొండెంకల్లులో పిహెచ్‌సిని, ఆరోగ్య కేంద్రంలో అందుతున్న సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్లను, మందులను పరిశీలించి, రోగులకు మంచి సేవలు అందించాలని వైద్యులను కోరారు. తదుపరి ఆ గ్రామంలోని చెరువును పరిశీలించి ఆర్.ఆర్.ఆర్ కింద జంగిల్ క్లియరెన్స్ చేసి, ఆదర్శవంతమైన చెరువుగా దీన్ని తీర్చిదిద్దాలని ఇంజినీరింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం కురుపాం సిహెచ్‌సిని ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరితో కలిసి ఆసుపత్రి పరిసరాలను పరిశీలించి పలు సూచనలు, మార్గదర్శకాలు జారీచేశారు. పర్యటనలో జిల్లా లెప్రోసి, ఎయిడ్స్, హెచ్.ఐ.వి మరియు టిబి నియంత్రణ అధికారి డాక్టర్ ఎం.వినోద్ కుమార్, ప్రత్యేక ఉప కలెక్టర్ డాక్టర్ పి.ధర్మచంద్రా రెడ్డి, సమగ్ర శిక్ష ఏపీసీ ఆర్.జగదీశ్వరరావు, ఇతర వైద్యాధికారులు, ఇంజినీరింగ్ అధికారులు, ఉపాధ్యాయులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



కురుపాం సిహెచ్‌సిని పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఎమ్మెల్యే జగదీశ్వరి

కూనేరుకు నైట్ హాల్ట్ బస్సు సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి -కొమరాడ

పార్వతీపురం నుంచి కూనేరు నైట్ హాల్ట్, అలాగే పార్వతీపురం నుంచి లంజి గ్రామ వరకు బస్సు సౌకర్యం కల్పించాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి కోరారు. మంగళవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ పార్వతీపురం నుండి కూనేరు మీదుగా లంజి గ్రామానికి, పార్వతీపురం నుండి కూనేరుకు నైట్ హాల్ట్ ల్ట్ బస్సు సౌకర్యం లేక గత నాలుగున్నరేళ్లుగా ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ బస్సు సర్వీసులు నడపాలని పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నా ప్రయోజనం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్‌టిసి అధికారులను నేరుగా సిపిఎం అడగ్గా ఆ రూటులో ప్రయాణికులు లేరని, రోడ్లు బాగోలేదని చెబుతున్నారు తప్ప బస్సు సౌకర్యం కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఈ రెండు రూట్లో బస్ సౌకర్యం కల్పించి అన్ని విధాలా ప్రయాణికులను ఆదుకోఆవలని కోరారు. లేకుంటే ఈనెల 21 తర్వాత సిపిఎం ఆధ్వర్యంలో ప్రయాణికులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ఎన్ని ఎకరాలున్నా ఒకే బస్తా : వ్యవసాయ శాఖ జెడి

ప్రజాశక్తి - వీరఘట్టం

రైతుకు ఎన్ని ఎకరాలున్నా ఒక్క యూరియా బస్తా మాత్రమే ఇవ్వాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.రాబర్ట్‌పాల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక మార్కెట్ యార్డ్‌లో గల రైతు సేవా కేంద్రాన్ని సందర్శించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. అధిక శాతం యూరియా వాడడం వల్ల తెగుళ్ల సంభవిస్తాయని, వీటిపై అవగాహన పెంపొందించుకొని సాగు చేయాలని అన్నారు. జిల్లాలో 22,500 మెట్రిక్ టన్నుల యూరియాకు ప్రతిపాదించగా ఇంతవరకు 16,303 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందన్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా 8,574 మెట్రిక్ టన్నులు, ప్రైవేటు డీలర్ల ద్వారా 7,729 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు సరఫరా చేశామన్నారు. యూరియా కావాల్సిన రైతు 1-బి, ఆధారు వంటి గుర్తింపు కార్డులు తీసుకురావాలన్నారు. డిబిటి కూడా చేయించాలన్నారు. జిల్లాలో 22 సొసైటీల ద్వారా వెయ్యి మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేసినట్లు తెలిపారు. మరో వెయ్యి టన్నుల వరకు సొసైటీ దగ్గర నిల్వ ఉందని, వాటిని కూడా రెండు, మూడు రోజుల్లో మండలానికి పంపించనున్నట్లు తెలిపారు. గ్రోమోర్ వద్ద 400 బస్తాల యూరియా పంపిణీకి సిద్ధంగా ఉందని, వీరఘట్టంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో 400 బస్తాలకు సరిపడా రైతులు వివరాలను సేకరించి స్లిప్పులు అందజేసి తద్వారా యూరియా పంపిణీ చేయాలని వివిఎలకు ఆదేశించారు. యూరియా కోసం రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అందరికీ యూరియా అందించేలా చర్యలు చేపడుతున్నట్లు ఆయన వివరించారు. ఆయనతో పాటు ఎడిఎ రత్నకుమారి, స్థానిక వ్యవసాయ అధికారి జె.సౌజన్య, మార్కెట్ డిఎం విమల, ఎఇఒ రాజేష్, వివిఎలు ఉన్నారు.

11 నుంచి మండల స్థాయి క్రీడలు

ప్రజాశక్తి - సీతంపేట

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్, గేమ్స్ మండల స్థాయి క్రీడలు స్థానిక గిరిజన ఆశ్రమ ఉన్నత బాలుర పాఠశాలలో ఈనెల 11 నుంచి నిర్వహించనున్నట్టు ఐటిడిఎ స్పోర్ట్స్ ఇన్‌ఛార్జి ఎన్.జాకబ్ దయానంద్ ఒక ప్రకటనలో తెలిపారు. వీటికి గానూ మండలంలోని అన్ని యాజమాన్య పాఠశాల 14, 17 ఏళ్లలోపు బాల, బాలికలు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. క్రీడల నిర్వహణకు మండలంలోని అన్ని పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించామని తెలిపారు.

సాగు ఖర్చు తగ్గిస్తూ ఎక్కువ ఆదాయం పొందాలి : ఎడిఎ

ప్రజాశక్తి - పాచిపెంట

రైతులు విచక్షణా రహితంగా రసాయనాలు వాడకుండా దిగుబడి పెంచడమే కాకుండా సాగు ఖర్చులను కూడా తగ్గిస్తూ భూమి ఆరోగ్యాన్ని కాపాడుతూ అంతర్ పంటలు గట్లు మీద కంది విత్తనాలు ద్వారా అదనపు ఆదాయాన్ని పొందేలా ఆలోచించాలని సాలూరు సహాయ వ్యవసాయ సంచాలకులు సత్యవతి అన్నారు. మండలంలోని పి.కోనవలసలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులతో ఆమె మాట్లాడుతూ రైతులు అనవసరంగా దుబ్బు గుళికలు వంటి వాటిపై అదనపు ఖర్చులు పెడుతున్నారని, వ్యవసాయ శాఖ సూచనలు తీసుకుని సాగు ఖర్చులు తగ్గించుకోవాలని సూచించారు. అనంతరం పనుకోవలస, విశ్వనాథపురం రైతులకు యూరియా పంపిణీ పరిశీలించి విచక్షణారహితంగా యూరియాను వాడొద్దన్నారు. ప్రస్తుత సాగు అవసరాలకు సరిపడా యూరియాను మాత్రమే రైతులు తీసుకెళ్లాలని, తదుపరి దఫా కోసం మళ్లీ ఎరువులు రావన్న ఆందోళన పడొద్దని తెలిపారు. అనంతరం ప్రకృతి సేద్య సిఆర్పి విజయ్ ఆధ్వర్యంలో బొబ్బిలివలసలో ప్రకృతి సేద్య రైతు మృత్యుంజయరావు తయారు చేసిన 600 లీటర్ల ఘనజీవామృతం తయారీలో పాల్గొన్నారు. ఘన ద్రవ జీవామృతల తయారీ ద్వారా రసాయన ఎరువులపై భారం తగ్గించవచ్చని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు, విఎఎలు, ప్రకృతి సేద్య అధికారులు పాల్గొన్నారు.

సీతానగరం : గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు సరఫరా చేస్తున్న యూరియాను కోట సీతారాంపురంలో మండల ప్రత్యేక అధికారి కె.శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రతి రైతుకు యూరియా అందుతుందని రైతులు ఆందోళన చెందవద్దన్నారు. అలాగే ఇప్పలవలస రైతు భరోసా కేంద్రం వద్ద తహశీల్దార్ జె.ప్రసన్న కుమార్, డిప్యూటీ ఎంపిడిఒ కెకె కుమార్ వర్మ, మండల వ్యవసాయ శాఖ అధికారి ఎస్.అవినాష్ రైతులకు ఇస్తున్న యూరియాను పరిశీలించారు. కార్యక్రమంలో ఆయా పంచాయతీ కార్యదర్శులు కామేశ్వరరావు, రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సీతంపేట: మండలంలోని సామారెల్లి రైతుసేవా కేంద్రంలో రైతులకు ఎరువులు పంపిణీ చేశారు. మండల జనసేన అధ్యక్షులు మండంగి విశ్వనాధం ఆధ్వర్యంలో తుంబకొండ సర్పంచ్ బిడ్డిక సోమేశ్వరావు, సామారెల్లి సర్పంచ్ సవర భాస్కరావు, యూరియా పంపిణీ చేశారు. నెల రోజుల పాటు యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నేడు ఎరువుల పంపిణీ చెయ్యడంతో కొంత ఊరట చెందారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వినోద్, తుంబకొండ పంచాయతీ సెక్రటరీ చిన్నారావు, వ్యవసాయ అధికారి వై.వాహిని అగ్రికల్చర్ అసిస్టెంట్ విమల తదితరులు పాల్గొన్నారు.




జీవామృతం తయారీని పరిశీలిస్తున్న ఎడిఎ సత్యవతి

సాలూరు రూరల్ : యూరియాను మోతదుకు మించి వాడొద్దని మండల వ్యవసాధికారి కె.శిరీష అన్నారు. మండలంలోని జీగిరాం, తుండ గ్రామాల పరిధిలో రైతులకు యూరియాను తహసీల్దారు నీలకంఠ రావు, ఎంపిడిఒ గొల్లపల్లి పార్వతితో కలిసి రైతులకు ఎరువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ నీలకంఠరావు మాట్లాడుతూ రైతులు ఎవరూ కూడా ఎరువుల కోసం భయపడాల్సిన అవసరం లేదని, తగినన్ని నిల్వలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు సచివాలయ సిబ్బంది వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఎరువులు

గుమ్మలక్ష్మీపురం : రైతులకు అందుబాటులో ఎరువులు ఉన్నాయని మండల ప్రత్యేక అధికారి, ఐసిడిఎస్ జిల్లా పిడి కనకదుర్గ అన్నారు. మండలంలోని లుంబేసు, ఇరిడి గ్రామాల్లో గిరిజన రైతులతో మంగళవారం ఆమె సమావేశం నిర్వహించారు. ప్రతి ఒక్క రైతుకు యూరియా అందిస్తామన్నారు. దీనిపై ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మండలంలో మొత్తం యూరియా 685 మెట్రిక్ టన్నులు అవసరం కాగా, ఇప్పటి వరకు 403 మెట్రిక్ టన్నులు వచ్చిందదని, రెండ్రోజుల్లో మరో 75 మెట్రిక్ టన్నులు దుడ్డుఖల్లు, గొరడ, ఆమిటీ, కేదారిపురం, కుక్కిడి, కొండవాడ రైతు సేవా కేంద్రాలకు తెప్పిస్తామని తెలిపారు. ఎవరైతే ఇంతవరకు యూరియా తీసుకోలేదో ఆ రైతులకు ముందుగా టోకెన్ రూపంలో యూరియా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఒ త్రివిక్రమరావు, తహశీల్దార్ ఎన్.శేఖర్, ఎఒ శంకరరావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



కార్యదర్శికి వినతిని అందజేస్తున్న సిపిఎం నాయకులు

సంతలో మౌలిక సదుపాయాలు కల్పించాలి : సిపిఎం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో ప్రతి గురువారం నిర్వహించే పశువుల సంతలో లక్షల్లో వ్యాపారం జరుగుతున్నా కనీస మౌలిక సదుపాయాలు లేవని సిపిఎం పట్టణ కమిటీ విమర్శించింది. తక్షణమే సంతలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ మంగళవారం స్థానిక మార్కెట్ యార్డ్ సెక్రటరీ బెవర శ్రీనివాసరావుకు సిపిఎం పట్టణ నాయకులు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ మాట్లాడుతూ మార్కెట్ యార్డు సంతలో ప్రతి గురువారం పశువులు, మేకలు, గొర్రెలు, కోళ్లు ఇలా అనేక రకాల వ్యాపారాలు లక్షల రూపాయల్లో జరుగుతుందని, అదే రీతిలో పన్నులు కూడా మార్కెట్ యార్డ్ సిబ్బంది వసూలు చేపడుతున్నారని తెలిపారు. అయితే సంతలో మౌలిక సదుపాయాలేవీ లేవని, కనీసం సంతలోపలికి వెళ్లేందుకు కూడా సరైన మార్గం లేదని అన్నారు. పై సమస్య పరిష్కారానికి సోమవారం డిఆర్ఒ కె.హేమలతకు వినతిని ఇవ్వగా, అనంతరం జెసిబి బ్లేడుతో కాస్త మోతాదులో పైపెచ్చు మాత్రమే బురదను తొలగించారని, ఎటువంటి శుభ్రతను పాటించలేదని, ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. సంతకు వచ్చిన వ్యక్తుల నుంచి వసూలు చేస్తున్న పన్నులకు న్యాయబద్ధంగా మౌలిక సదుపాయాలు కల్పించకపోవడం అన్యాయమని మండిపడ్డారు. సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న గిరిజనులకు, దళితులకు, వ్యాపారులకు నీటి చుక్క కూడా ఇవ్వలేని పరిస్థితుల్లో అధికారులు సిబ్బంది ఉన్నారా అని ప్రశ్నించారు. వర్షాలు పడితే సంతలోపలికి వెళ్లలేని పరిస్థితి ఉందన్నారు. దీనివల్ల వ్యాపారులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. కావున జిల్లా స్థాయి అధికారులు వెంటనే స్పందించి అధిక మోతాదులో పన్నులు వసూలు చేస్తున్న మార్కెట్ యార్డ్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని, మంచినీరు పెట్టాలని, మరుగుదొడ్లు నిర్మించాలని, మార్కెట్ యార్డ్ రోడ్లు శుభ్రం చేసి కొత్తగా రోడ్లు వేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే వచ్చేవారం సంతలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ నాయకులు బి.సూరిబాబు, ఎస్.ఉమా, పి.రాజశేఖర్ పాల్గొన్నారు..

వారి సేవా భావం మాకు ఆదర్శం

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

వారిలో సేవాభావం, సమస్యలపై పోరాడే వ్యక్తిత్వం, బోధించే మంచి వ్యక్తిత్వం మాకు ఆదర్శంగా నిలిచాయని మండలంలోని డుమ్మంగి పంచాయతీ గుణద గ్రామ ప్రజలు అన్నారు. అటువంటి వ్యక్తులతోనే మా పంచాయతీ అభివృద్ధి పథంలో నడుస్తుందని పేర్కొన్నారు. ఈ మేరకు వారి సేవలను గుర్తిస్తూ మంగళవారం గుణద గ్రామ మహిళల ఆధ్వర్యంలో ఎస్టీ కమిషన్ సభ్యుడుగా కద్రక మల్లేశ్వరరావు, ఎస్టీ సెల్ కన్వీనర్‌గా మండంగి భూషణరావు, ఉత్తమ ఉపాధ్యాయుడి పత్తిక శంకర్రావు , పంచాయతీ ఏకగ్రీవ సర్పంచ్ గా ఉత్తమ పాలన అందించిన పాలక క్రాంతికుమార్, బిజెపి కన్వీనర్‌గా బాధ్యతలు చేపట్టిన అప్పలస్వామి కు ఘనంగా సత్కరించారు.



గర్భిణులకు సూచనలు ఇస్తున్న వైద్యాధికారులు

గర్భిణులు జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి - సీతానగరం

గర్భిణీలు జాగ్రత్తలు పాటించాలని సీతానగరం, పెదఅంకలాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు పి.ఉషారాణి, పి.రమ్య సాయి అన్నారు. మంగళవారం సీతానగరం పిహెచ్‌సిలో గర్భిణీలకు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ఉషారాణి మాట్లాడుతూ ప్రతినెలా గర్భిణీలు రక్తం, ఇతర ఆరోగ్య పరీక్షలు చేసుకొని ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలన్నారు. పిఎంఎస్ఎ కార్యక్రమంలో భాగంగా గర్భిణీలకు రక్త పరీక్షలు హిమోగ్లోబిన్ శాతం బట్టి వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. అలాగే పెద్ద అంకలాం పిహెచ్‌సిలో వైద్యాధికారి రమ్యసాయి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌విలు వరలక్ష్మి, హెల్త్ సూపర్వైజర్లు, ఎఎన్ఎంలు, ఆశాలు గర్భిణీలు పాల్గొన్నారు.

22 నుంచి దసరా సెలవులు ఇవ్వాలి

ప్రజాశక్తి -సాలూరు

ఈనెల 21న మహాలయ అమావాస్య అయినందున ఆ రోజు నుంచే దసరా ఉత్సవాలు ప్రారంభమవుతాయని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర సహాధ్యక్షులు జె.రాము నాయుడు, జిల్లా అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరావు, కార్యదర్శి ఎన్.చంద్రశేఖర్ ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 23 నుంచి సెలవులు ప్రకటించడం సబబుకాదని, తెలంగాణలో కూడా ఈనెల 22 నుంచి అక్టోబర్ 3వరకు అక్కడ ప్రభుత్వం దసరా సెలవులు ప్రకటించిందని చెప్పారు. హిందువులు ఎంతో భక్తి శ్రద్ధలతో జరుపుకునే దసరా ఉత్సవాలు విజయవాడ కనకదుర్గ ఆలయంలో కూడా 21 నుంచే ప్రారంభమవుతాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే 22నుంచి అక్టోబర్ 3వరకు దసరా సెలవులు ప్రకటించాలని ఆ ప్రకటనలో వారు కోరారు.

నిరసన వారాన్ని విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

నిరసన వారాన్ని విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట ఎపిటిఎఫ్ మండల అధ్యక్షులు మండల మురళి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం తెలిపారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు మాట్లాడుతూ ఈనెల 11న నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరవ్వాలని, 12న మండల కేంద్రంలో నిరసన ప్రదర్శన, 13,14 తేదీల్లో ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు, 15న పాత తాలూకా కేంద్రాల్లో నిరసన ప్రదర్శన, 16న జిల్లా కేంద్రంలో నిరసన ప్రదర్శన, 17న సిఎం, సిఎస్‌లకు వాట్సాప్, ఇ-మెయిల్ ద్వారా వినతులు పంపనున్నట్లు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నరహరిరావు, మండల ప్రధాన కార్యదర్శి ఆర్.ధనుంజయనాయుడు, బి.రామారావు, బివి నాయుడు, బిఎం గౌరీశ్వరరావు, తదితర ఎపిటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

నాటుసారా నిర్మూలనకు కమిటీలు

ప్రజాశక్తి - పాలకొండ

నాటు సారా నిర్మూలనలో భాగంగా నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా మంగళవారం కమిటీ ఏర్పాటు చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. మండల స్థాయిలో ఎంపిపి బొమ్మాలు భాను చైర్మన్‌గానూ, మున్సిపల్ చైర్మన్ ఆకుల మల్లేశ్వరి కన్వీనర్‌గా నియమించారు. తహశీల్దార్ రాధాకృష్ణ, ఎక్సైజ్ సిఐ సూర్యకుమారి, ఎంపిడిఒ విజయరంగారావు, ఎస్సై ప్రయోగ మూర్తి ఈ కమిటీలో సభ్యులుగా నియమించారు. అనంతరం ఎంపిపి మాట్లాడుతూ ఈ కమిటీ ద్వారా నాటుసారా నిర్మూలనకు తనవంతు చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కె అప్పలనాయుడు తదితరులు ఉన్నారు.



సభలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

విద్యార్థి దశ నుంచే సక్రమంగా చదువుకోవాలి

ప్రజాశక్తి - కురుపాం

విద్యార్థి దశనుంచే సక్రమంగా చదువుకొని ఉన్నత స్థానంలో స్థిరపడాలని జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి వై.నాగేశ్వరరావు విద్యార్థులకు సూచించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ ఎం.కుమారస్వామి ఆధ్వర్యంలో జరిగిన ఫ్రెషర్స్ డే వేడుకలకు ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సాంస్కృతిక, క్రీడా రంగాల్లో రాణించి కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరును తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ ఏడాది పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి మంచి మార్కులు సాధించాలని కోరారు. కార్యక్రమంలో చినమేరంగి కళాశాల ప్రిన్సిపాల్ రమణ, అధ్యాపకులు, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని వృద్ధుడు మృతి

శృంగవరపు కోట: పట్టణంలోని కోటాన వీధికి చెందిన కోటాన వల్లయ్య(75)అతని అన్న కొడుకు కోటాన నారాయణరావు ఇంటికి భోజనానికి వెళ్లేందుకు రోడ్డుకి పక్కగా నడుచుకుంటూ వెళ్తుండగా వన్‌వే జంక్షన్ వద్దకు చేరుకునే సరికి ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యంగా అజాగ్రత్తగా, హార్న్ కొట్టకుండా నడుపుతూ వచ్చి వల్లయ్యను ఢీ కొట్టాడు. దీంతో వల్లయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. అతని అన్న కొడుకు కోటాన నారాయణరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

నాటు బండి కిందపడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - శృంగవరపు కోట

మండలంలోని వేములపల్లి గ్రామంలో బోడబల్ల సన్యాసి రావు(48) అనే వ్యక్తి ఎద్దుల బండితో ఇసుక తరలిస్తుండగా ప్రమాదవశాత్తు రోడ్డు మీద పడిపోయాడు. అదే సమయంలో అతని ఎద్దుల బండి అతనిపై నుంచి ఎక్కిపోయింది. అతనిని వెంటనే పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మరణించినట్లు అతని భార్య బోడబల్ల ఉమ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.

కోళ్ల ఫారం వ్యర్థాలతో చేపలు మృతి

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని నీలకంఠరాజుపురం గ్రామపంచాయతీ పెద్దగుడిపాల రెవెన్యూ పరిధిలోగల పీసుబంద చెరువులోకి కోళ్ల ఫారం నుంచి వచ్చే వ్యర్థాలు చేరడంతో చెరువులో ఉన్న చేపలు మృతి చెందాయి. చెరువులోని చేపలు పెద్దఎత్తున చనిపోగా, అదే నీరు తాగిన పశువులు అనారోగ్యానికి గురయ్యాయి. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గొటివాడ దేవి మాట్లాడుతూ పంచాయతీ అనుమతి లేకుండా అక్రమంగా ఈ గుడ్లకోళ్ల ఫారం నడుస్తోందన్నారు. వ్యర్థాలు చెరువులోకి వదిలిపెట్టడం వల్ల పర్యావరణం కాలుష్యం అవుతోందని, ప్రజల ఆరోగ్యానికి కూడా ముప్పు వాటిల్లుతోందని, వెంటనే అధికార యంత్రా ంగం చర్యలు తీసుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. సంబం ధిత శాఖలు తక్షణమే సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



ప్రతి అక్షరం - ప్రజల పక్షం

ప్రజాశక్తి

తెలుగు దినపత్రిక

PRAJASAKTI 45 ANNIVERSARY 1981-2025

ప్రత్యేక అనుబంధం

పూసపాటిరేగ మండలం

బుధవారం 10-9-2025 | విజయనగరం జిల్లా | 12 పేజీలు

పర్యాటక మణిహారం.. పూసపాటిరేగ తీరం



చింతపల్లి సముద్ర తీరం

ఓవైపు విశాలమైన తీర ప్రాంతం... మరోవైపు ప్రకృతిని పరవశింపజేసే పచ్చని కొండలు... ఇంకోవైపు ఆరు వరుసల జాతీయ రహదారి... బహుళ ఉత్పత్తులకు నెలవైన పరిశ్రమలు... వీటి నడుమ ఆధ్యాత్మికతను పెంపొందించే పురాతన దేవాలయాలు... పర్యాటకులను ఆకర్షించే ప్రాంతాలు పూసపాటిరేగ సొంతం. ఇలా అనేక వనరులు ఉన్న ఈ మండలం వాటిని వినియోగించుకుంటే మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంది. పాలకులు ఆ దిశగా దృష్టి పెడితే జిల్లాలోనే అభివృద్ధి పథంలో పూసపాటిరేగ మండలం ముందు వరుసలో ఉంటుందనడంలో సందేహం లేదు.

– ప్రజాశక్తి, పూసపాటిరేగ

పూర్తి కథనం 2లో




గోవిందపురం ఆలయం

అభివృద్ధిపై దృష్టిపెడితే విస్తృత అవకాశాలు



తీరంలో ఆహ్లాదకరంగా కొబ్బరితోటలు





పర్యాటక మణిహారం.. పూసపాటిరేగ తీరం

ప్రజాశక్తి-పూసపాటిరేగ

ఒకప్పుడు ఈ ప్రాంతమంతా విజయనగర గజపతుల పాలనలో ఉండేది. కాలక్రమేణా వచ్చిన మార్పుల్లో విశాఖపట్నం జిల్లాలోకి వెళ్లింది. విజయనగరం జిల్లా ఏర్పడిన తర్వాత ఇందులో అంతర్లీనమైంది. 1985 మేలో మండల వ్యవస్థ రావడంతో పూసపాటిరేగ మండల కేంద్రంగా ఆవిర్భవించింది. మండలంలో ప్రస్తుతం 27 పంచాయతీలు, 36 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. ఒక ఎంపిపి, జెడ్‌పిటిసి స్థానాలతోపాటు, 20 ఎంపిటిసి స్థానాలు, 27 పంచాయతీలు ఉన్నాయి. 14 కిలో మీటర్ల సువిశాలమైన సముద్ర తీరం ఉంది. తీరం వెంబడి 14 మత్స్యకార గ్రామాలుఉన్నాయి. నాతవలస బ్రిడ్జి నుంచి కందివలస బ్రిడ్జి వరకూ 14 కిలో మీటర్ల జాతీయ రహదారి విస్తరించి ఉంది. ఎటు చూసినా ప్రకృతి అందాలతో పరవశింపజేసే ఈ మండలం పలు సమస్యలతో సతమతమవుతూ అభివృద్ధిలో వెనుకబడే ఉంది. ప్రజలు కాలుష్య కోరల్లో చిక్కుకొని సమస్యలతో అనునిత్యం పోరాడుతూనే జీవనం కొనసాగిస్తున్నారు.

కాలుష్యంతో సతమతం

పరిశ్రమల నుంచి వెదజల్లుతున్న కాలుష్యంతో మండల ప్రజలు తీవ్రంగా ఇబ్బందులకు గురువుతున్నారు. మండలంలోని మైలాన్, సిపి ఆక్వా, ఎస్‌ఎంఎస్, హెచ్‌బిఎల్, వేధా బయోఫ్యూయల్, విజయనగర్ బయోటెక్ పరిశ్రమలు ఉన్నాయి. వీటిలో మైలాన్, ఎస్‌ఎంఎస్, హెచ్‌బిఎల్, వేధా బయోఫ్యూయల్ పరిశ్రమల ద్వారా వస్తున్న కాలుష్యం వల్ల పలు గ్రామాల్లో భూగర్భ జలాలు కలుషితమయ్యాయి. చెరువులు , పంట పొలాలు నాశనమవుతున్నాయి. కందివలస, కనిమెళ్ల, కామవరం, అల్లాడపాలెం, చోడమ్మ అగ్రహారం, జి.చోడవరం గ్రామాల్లో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. మండలంలో ఎక్కువ శాతం ప్రజలు కీళ్ల నొప్పులు, కిడ్నీ సమస్యలు, శ్వాస కోస వ్యాధులతో బాధపడుతున్నారు. కాలుష్య నియంత్రాణాధికారులకు ప్రజలు ఎన్నిసార్లు మొత్తుకున్నా ప్రయోజనం లేదు. దీంతో కాలుష్యం బాధపడలేక కొంత మంది ఉన్న ఊరును వదిలివెళ్లిపోతున్నారు. జీవన ప్రమాణాలు తగ్గిపోతున్నాయి.

కలగానే మిగిలిన ఇఎస్‌ఐ ఆసుపత్రి

మండలంలోని వివిధ పరిశ్రమల్లో పనిచేస్తున్న సంఘటిత, ఆసంఘటిత రంగ కార్మికులు సుమారుగా పది వేల మంది ఉన్నారు. పరిశ్రమల్లో వెదజల్లుతున్న కాలుష్యం వల్ల అనేక మంది రోగాల బారినపడుతున్నారు. ఇఎస్‌ఐ ఆసుపత్రి లేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. చిన్న చిన్న రోగాలకు కూడా వేలాది రూపాయలు ప్రవేటు డాక్టర్లకు ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇఎస్‌ఐ ఆసుపత్రి పెట్టాలని సిఐటియు ఆధ్వర్యంలో ఎన్నిసార్లు వినతులిచ్చినా ఫలితం లేదు.

కలుషితమైన భూగర్భజలాలు

మండలంలోని ఏ గ్రామంలో చూసినా భూగర్భ జలాలు కలుషితమైపోయాయి. అల్లాడపాలెం, కందివలస, కనిమెట్ట, కనిమెల్ల, జి.చోడవరం, చోడమ్మ అగ్రహారం, కొవ్వాడ తదితర గ్రామాల్లో భూగర్భ జలాలు కలుషితమయ్యాయని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల పరిశీలనలో తేలింది. మిగతా గ్రామాల్లో బోర్లు, నేల బావిల్లో నీటిని తాగితే ఫ్లోరైడ్ కంటెంట్ వల్ల కీళ్ల నొప్పులతో, నడుం నొప్పులతో ప్రజలు సతమతమవుతున్నారు. మండలంలో ఫ్లోరైడ్ కంటెంట్ ఎక్కువగా ఉండడంవల్ల మండలానికి రూ.10కోట్లుతో పైలెట్ ప్రాజెక్టు నిర్మించారు. చంపావతి నది నుంచి నేరుగా తాగునీరు గ్రామాలకు సరఫరా చేయడానికి ఓవర్ హెడ్ ట్యాంకులను కూడా నిర్మించారు. నది నుంచి నీరు సరఫరా అవుతున్న పైపులు సరిగ్గా లేకపోవడంతో గ్రామాల్లో ఓవర్ హెడ్ ట్యాంకులకు అరకొరగా నీరు సరఫరా అవుతుంది. ఆ నీరు గ్రామస్తులకు చాలక స్థానిక బోర్లులో నీటిని ట్యాంకులకు పంచాయతీ సిబ్బంది ఎక్కిస్తున్నారు. దీంతో మళ్లీ ఫ్లోరైడ్ నీటినే తాగాల్సిన పరిస్థితి ఏర్పడింది.

బస్సు షెల్టర్ లేక ఇబ్బందులు

మండల కేంద్రంలో బస్సు షెల్టర్ లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హైదరాబాద్, విశాఖ, విజయవాడ, విజయనగరం, శ్రీకాకుళం, ఒడిశాకు వెళ్లడానికి ఇదే రహదారి. దీంతో అనునిత్యం వేలాది మంది ప్రయాణీకులు మండల కేంద్రం జాతీయ రహదారిపై బస్సుల కోసం వేచి చూస్తారు. ప్రయాణీకులు వేచి ఉండడానికి నిలువ నీడ లేదు. దీంతో వృద్ధులు, బాలింతలు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు.

ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు చేయాలి

మండలంలో నాతవలస జంక్షన్ నుంచి అల్లాడపాలెం జంక్షన్ వరకూ సుమారుగా 10కిలోమీటర్ల జాతీయ రహదారి ఉంది. ఈ రహదారి గుండా నిత్యం వేలాది వాహనాలు వెళ్తుంటాయి. దీంతో అను నిత్యం ఏదో ఒక చోట రోడ్డు ప్రమాదం జరుగుతూనే ఉంటుంది. క్షతగాత్రలకు సకాలంలో వైద్యమందక తీవ్ర ఇబ్బందులకు గురవుతుంటారు. జాతీయ రహదారిని ఆనుకొని ట్రామాకేర్ సెంటర్ పెడతామని అధికార్లు పలుమార్లు చెప్పినా ఫలితం లేకపోయింది. జాతీయ రహదారి ఆనుకొని ఉండడంతో ఇక్కడ ట్రమాకేర్ సెంటర్ అవసరం ఎంతయినా ఉంది.

రామతీర్థ సాగర్ పూర్తిచేయాలి

మండలంలోని భూములు వర్షాధారంపైనే ఆధారపడి పంటలు పండుతాయి. దీంతో మండలంలోని కుమిలిలో 2007లో రామతీర్థ సాగర్ నిర్మాణం చేపట్టారు. ఆ ప్రాజెక్టు నిర్మాణమైతే మండలంలో సుమారుగా వెయ్యి హెక్టార్లకు సాగునీటి సౌకర్యం కలుగుతుంది. కానీ ఏళ్లు గడుస్తున్నా కుమిలిలో చేపట్టిన బండ నిర్మాణమే ఇప్పటి వరకూ పూర్తి కాలేదు. దీంతో రైతులకు సాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పట్లో పూర్తవుతుందన్న నమ్మకం కూడా రైతన్నలకు లేదు. ప్రాజెక్ట్ పూర్తి చేస్తే ఈ ప్రాంతం సస్యశ్యామలమవుతుంది.

పట్టాల కోసం ఎదురు చూపు

మండలంలోని కొళ్లాయివలస, చినబత్తివలస, పెదబత్తివలసలో గిరిజనులు, దళితులు ప్రభుత్వ భూములను ఎప్పటి నుంచో సాగు చేసుకుంటున్నారు. సాగు చేస్తున్న భూములు పట్టాల కోసం ఎదురు చూస్తున్నారు. ఏడో విడత భూపంపిణీలో పట్టాలిస్తారని ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం మండలం ఉడా పరిధిలో ఉండడం వల్ల భూ పంపిణీకి బ్రేకులు పడ్డాయి. ఇకపై మండలంలో భూ పంపిణీ ఉండదన్నది అధికార్లు చెబుతున్నారు.

జట్టీ ఏర్పాటు చేయాలి

మండలంలో సుమారుగా 10 వేల మంది మత్స్యకారులు ఉన్నారు. వీరిలో 4 వేల మంది మత్స్యకారులు వేటపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. తీరంలో జట్టీలు లేక వీరంతా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. జట్టీ లేకపోవడంతో నిత్యం వేటకు వెళ్లే ముందు పడవలను సముద్రంలోకి తీసుకెళ్లేందుకు తీవ్రంగా కష్టపడాల్సి వస్తుంది. జట్టీ లేకపోవడంతో కొంతమంది పడవలను సముద్రంలోనే లంగరు వేసి వదిలేస్తున్నారు. తుపాన్ల సమయంలో ఈ బోట్లు కొట్టుకు పోతున్నాయి. జట్టీ ఉంటే బోట్లును తీరం ఒడ్డుకు తెచ్చి జట్టీకు కట్టుకునే అవకాశం ఉంటుంది. జట్టీ నిర్మాణానికి మత్స్యకారులు చాలా కాలంగా ఎదురు చూస్తున్నారు.

నెరవేరిన కల

మండలంలోని సుమారుగా 60 గ్రామాలు ఉన్నాయి. కొన్ని గ్రామాల్లో నేటికీ వందలాది తాటాకు ఇళ్లు ఉన్నాయి. ఈ ప్రాంతంలో ఏటా పదుల సంఖ్యలో ఇళ్లు అగ్ని ప్రమాదానికి గురవుతున్నాయి. అగ్ని ప్రమాదం జరిగిన సమయంలో విజయనగరం, రణస్థలం నుంచి అగ్ని మాపక దళం వచ్చే వరకూ వేచి చూడడంతో ఇళ్లు కాలిబూడిదవుతున్నాయి. ఈనేపథ్యంలో ఏ నాటి నుంచో పాలకులు ఇస్తున్న హామీ ఎట్టకేలకు నెరవేరింది. ఇటీవలే ఎమ్మెల్యే లోకం మాధవి ఫైర్ స్టేషన్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. పనులు సాగుతున్నాయి.

ప్రజలతో ప్రజాశక్తి

ప్రజాశక్తి-విజయనగరం

'ప్రతి అక్షరం ప్రజల పక్షం' అంటూ ప్రజాశక్తి దినపత్రిక 45వ వసంతంలోకి ప్రవేశించింది. 1981 ఆగస్టు ఒకటో తేదీన ప్రజాశక్తి దినపత్రికగా వెలువడింది. 1980వ దశకంలో తెలుగునాట సాగిన అఖిలపక్ష రైతు ఉద్యమం, తదనంతరం ఎగసిన కాంగ్రెస్ వ్యతిరేక వెల్లువకు ఆలంబనగా నిలిచింది. 90వ దశకంలో దేశవ్యాప్తంగా వచ్చిన నయా ఉదారవాద విధానాలు, వాటితోపాటే రాష్ట్రంలో ప్రపంచబ్యాంకు సంస్కరణలతో ప్రజలకు కలుగుతున్న నష్టాన్ని, రానున్న ప్రమాదాల గురించి వివరించింది. వినాశకర విధానాలకు వ్యతిరేకంగా పోరాడే కార్మిక, కర్షకులకు, విస్తార ప్రజా సమూహాలకు మద్దతుగా నిలిచింది. 2000 దశకంలో పాలకులు బషీర్‌బాగ్‌లో, ముదిగొండలో తూటాల వర్షం కురిపించి నిండు ప్రాణాలను బలిగొన్నా, ఆ ఉద్యమాలన్నింటిలోనూ ప్రచారాందోళన సాధనంగా ప్రజాశక్తి తనవంతు పాత్ర పోషించింది.

దేశంలో నయా ఉదారవాద విధానాలకు తోడు మతతత్వ శక్తులూ పెరిగాయి. ఐక్యంగా ఉన్న ప్రజల మధ్య విద్వేష సృష్టికి మతోన్మాదులు అయోధ్య మొదలు వారణాసి, మధుర వరకు అనేక వివాదాలను లేవనెత్తి రావణకాష్టాన్ని రగిలిస్తున్నారు. కార్పొరేట్ మతతత్వ కూటమి పాలనలో ప్రజాస్వామ్యం, స్వావలంబన, లౌకికతత్వం, సామాజిక న్యాయం హరించి వేయబడుతున్నాయి. రాజ్యాంగానికి ముప్పు ఏర్పడింది. నిరంకుశ ధోరణులు ప్రబలుతున్నాయి. అటవీ హక్కులకు పాలకులు తూట్లు పొడుస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలకు, దేశానికి తీవ్ర హాని కలిగించే పరిణామాలన్నింటిపైనా పాఠకులకు ముందస్తు సమాచారాన్ని అందించడంలో ప్రజాశక్తి ముందుంది. దేశ సమైక్యత, సమగ్రత పరిరక్షణకు, ప్రజల ఐక్యతను కాపాడడం కోసం అన్ని సందర్భాల్లోనూ నికరంగా నిలిచింది. భాషా ప్రయుక్త రాష్ట్రాలను విచ్ఛిన్నం చేయరాదన్న సూత్రబద్ధ వైఖరికి కట్టుబడిన ప్రజాశక్తి, ఆంధ్రప్రదేశ్ విభజనను వ్యతిరేకించి సమైక్యత కోసం నిలబడింది. అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు కూడబలుక్కొని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను ముక్కలు చేశాయి. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి ప్యాకేజీ, కడప ఉక్కు, విశాఖ రైల్వేజోన్... ఇలా ఎన్నో హామీలిచ్చినా అవి నీటి మీద రాతలుగా మారాయి. ఈ రాష్ట్రానికి ద్రోహం చేస్తున్న కేంద్ర పాలకులను దోషులుగా నిలపడంలోనూ, రాష్ట్రంలోని పాలక, ప్రధాన ప్రతిపక్ష పార్టీల అవకాశవాద వైఖరిని ఎండగట్టే విషయంలోనూ ప్రజాశక్తి ముక్కుసూటిగా వ్యవహరిస్తోంది. విద్యుత్ ఛార్జీలను పెంచితే అది 1999లో గానీ, 2025లో గానీ పాలకుల విధానాలను, సంస్కరణల పేరిట సాగుతున్న దోపిడీని, విద్యుత్ భారాలను ప్రతిఘటించడానికి జనానికి సమాచారాన్ని ఇవ్వడంలో ముందుంది. తరగతుల విలీనం పేరిట విద్యారంగంలో చేపట్టిన సంస్కరణలు, వాటి పర్యవసానాలను ప్రజల ముందుంచింది. తమ హక్కుల సాధనకు ఉద్యమించే ఉద్యోగ, ఉపాధ్యాయులు, చిరువ్యాపారులు, మహిళలు, విద్యార్థి, యువజనలకు బాసటగా నిలుస్తోంది.

మహనీయుల త్యాగాలతో, ప్రజల పోరాటాలతో సాధించుకున్న స్వాతంత్ర్యానికి కార్పొరేట్, మతతత్వ శక్తుల మూలంగా ముప్పు ఏర్పడింది. మహత్తర స్వాతంత్ర్య పోరాటంలోనూ ప్రజాశక్తి పాలుపంచుకుంది. 1942లోనే పత్రిక ప్రారంభమైనా పాలకులు నిషేధం విధించడంతో నిలిచిపోయింది. తిరిగి 1968లో వారపత్రికగా వెలువడింది. 1981 ఆగస్టు ఒకటో తేదీ నుంచి దినపత్రికగా దినదినాభివృద్ధి చెందుతూ ప్రస్తుతం ఎనిమిది కేంద్రాల నుంచి వెలువడుతోంది. భరతమాత ముద్దుబిడ్డ పుచ్చలపల్లి సుందరయ్య చొరవతో పత్రిక స్థాపన, వ్యవస్థాపక సంపాదకునిగా మోటూరు హనుమంతరావు వేసిన పునాది, పత్రికను విస్తరింప జేయడంలో ఎనలేని కృషి సల్పిన కొరటాల సత్యనారాయణ వంటి మహామహులు, వారి సహచరులు చూపిన మహత్తర మార్గంలోనే ప్రజాశక్తి నడుస్తోంది. పాఠకులు, ప్రకటనకర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషుల విశేష ఆదరణ వల్లనే కోవిడ్ విపత్తుతో సహా అనేక ఒడిదుడుకులను అధిగమిస్తూ ఈ ప్రస్థానం అప్రతిహతంగా సాగుతోంది. మున్ముందు ఇంతకన్నా మిన్నగా ఆదరించి, ఆశీర్వదించాలని మనవి చేస్తున్నాం.





ఎయిర్‌పోర్టు టెర్మినల్ భవనం

భోగాపురం (అల్లూరి సీతారామరాజు) గ్రీన్ ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయ పనులు శరవేగంగా సాగుతున్నాయి. 2026 జూన్ నాటికి విమాన సర్వీసులు అందుబాటులోకి తెస్తామని ప్రభుత్వం చెబుతోంది. ఇందుకనుగుణంగా వివిధ రాకాల పనులు చకచకా ముందుకు సాగుతున్నాయి. విమానాశ్రయం చుట్టూ స్టార్ హోటళ్లు, రిసార్ట్స్ ఏర్పాటు కానున్నాయి. ఇందుకనుగుణంగా ప్రభుత్వం భూములు, సదుపాయాల కల్పనకు కూడా ముందుకు వచ్చింది. ఈనేపథ్యంలో భోగాపురం పరిసర ప్రాంతం భూతల స్వర్గంగా మారనుంది.



ఎయిర్‌పోర్టు పనులను పరిశీలిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు (ఫైల్)

ఉత్తరాంధ్రకు మణిహారం

- భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం
- పరిసర ప్రాంతాల్లో భారీ టూరిజం ప్రాజెక్టులు
- జాతీయ రహదారిని కలుపుతూ పలు రహదారులు
- వచ్చే జూన్ నాటికి ప్రారంభించేందుకు సన్నాహాలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఉత్తరాంధ్ర అభివృద్ధిలో భాగంగా 2015లోనే భోగాపురం విమనాశ్రయానికి నాందిపలికారు. సుమారు 15వేల ఎకరాలకు సేకరించేందుకు అప్పటి ప్రభుత్వం సిద్ధపడగా, రైతుల తరపున సిపిఎం నిలవడంతో క్రమంగా 2,500 ఎకరాలకు తగ్గింది. ఎయిర్‌పోర్టు కోసం రైతులు పుట్టిపెరిగిన ఊళ్లు, తాత తండ్రుల నుంచి సంక్రమించిన భూములు త్యాగం చేసిన సంగతి తెలిసిందే. సిపిఎం పోరాటంతో నిర్వాసితులకు న్యాయం మెరుగైన ప్యాకేజీ కూడా వచ్చింది. అప్పటికీ కొంతమంది న్యాయ స్థానాలను ఆశ్రయించడంతో ప్రభుత్వం చొరవ చూపి కేసులు ఉపసంహరించుకునేలా చేసింది. దాదాపు కేసులన్నీ క్లియర్ కావడంతో సుమారు 2వేల ఎకరాల్లో జిఎంఆర్ పనులు చేపట్టింది. మాస్టర్ ప్లాన్ ప్రకారం మూడు దశల్లో నిర్మాణ పనులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. తొలిదశలో చేపట్టాల్సిన పనుల్లో 74శాతం పూర్తియినట్టు అధికార యంత్రాంగం చెబుతోంది. ఇప్పటికే రన్‌వే, టెర్మిన్, మట్టి పనులు పూర్తయ్యాయి. టాక్సీవే, ఎయిర్ ఫీల్డ్ గ్రౌండ్ లైటింగ్ పనులు త్వరలోనే ప్రారంభించనున్నట్టు సమాచారం. మరో ఆరునెలల లోపే మిగులు పనులు పూర్తిచేసి, ట్రైల్‌రన్ కూడా చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈలెక్కన 2026 జూన్ నాటికి విమానాలు నడిపేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. విమానాశ్రయ నిర్మాణ పనులు చేపట్టిన జిఎంఆర్ సంస్థ ఇటీవల కాలంలో పూర్తిగా రంగంలోకి దిగింది. జాతీయరహదారిపై ప్రయాణించే వాహనాలకు ఇబ్బంది లేకుండా అనుసంధాన రహదారిని కలిపేందుకు '8' ఆకారంలో ట్రంపెట్ నిర్మిస్తున్నారు. ఇందుకోసం అదనంగా 25 ఎకరాలు సేకరించారు.



ఎయిర్‌పోర్టు రన్‌వే

ఎయిర్‌పోర్టుకు అనుసంధానంగా 23రహదారులు

భోగాపురం నుంచి విశాఖవైపు ఎక్కువ ట్రాఫిక్ ఉండే అవకాశాలు ఉన్నందున ఆ నగరాన్ని కలిపే రహదారులను అనకాపల్లి, ఆనందపురం రహదారికి అనుసంధానం చేసేదిశగా ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. విశాఖ, అనకాపల్లి, విజయనగరం జిల్లాల నుంచి జాతీయ రహదారిని అనుసంధానం చేసేలా 23రోడ్లను గుర్తించారు. వీటిలో 18రహదారులు తొలిదశలోనే చేపట్టాలన్నది ప్రభుత్వ ఆలోచన. వీటిలో 11వరకు గ్రీన్ ఫీల్డ్ రహదారులు ఉన్నాయి. మిగిలిన ఏడు ఇప్పటికే ఉన్నాయి. వీటిని పొడిగించడం, విస్తరించడం వంటివి చేస్తారు. ఇందుకోసం రూ.500కోట్ల బడ్జెట్ అవసరం కానున్నట్టుగా అంచనాలు కూడా రూపొందించారు. మన జిల్లాలో అయినాడ జాతీయ రహదారి కూడలి, బొడ్డవలస నుంచి విజయనగరం రింగురోడ్డు వరకు 9రోడ్లను 24మీటర్లకు మీటర్ల వరకు రహదారులు రానున్నాయి. ఎయిర్‌పోర్టు చుట్టూ అధునాతన ప్రాజెక్టులకు అడుగులు పడుతున్నాయి. జిల్లాలో కోస్టల్ కారిడారు ఇప్పటికే సర్వే పూర్తిచేసినట్లు సమాచారం.

స్టార్ హోటళ్లు, రిసార్ట్సుకూ పెద్దపీట

పర్యాటకాభివృద్ధి పేరిట హోటళ్లు, రిసార్ట్స్, కన్వెక్షన్ హాల్స్ తదితరాల ఏర్పాటు కానున్నాయి. ప్రభుత్వం తరపున స్థలాలు, మౌలిక సదుపాయాల కల్పనకు అడుగులు వేస్తోంది. ఇప్పటికికే ఎయిర్‌పోర్టుకు ఆనుకునివున్న కంచేరు రెవెన్యూ పరిధి 227/1లో 3.10ఎకరాలను 'సన్ రే, అవని' సంస్థలకు కేటాయిస్తూ ప్రభుత్వానికి అధికార యంత్రాంగం ప్రతిపాదనలు పంపింది. ఎయిర్ పోర్టుకు మరో వైపున ఉన్న భీమిలి పరిధిలోని అన్నవరం సముద్ర తీరంలో మే ఫెయిర్, ఒబెరాయ్ గ్రూపులకు చెందిన హోటళ్లకు అప్పటికే స్థలాలు కేటాయించారు.

ప్రభుత్వం చెప్పిందంతా బూటకమే

ఎంపిపి మహంతి కల్యాణి

ప్రజాశక్తి -పూసపాటిరేగ



ఎన్నికల ముందు ప్రతి ఇంటికి సంక్షేమం, పేదలందరికీ ప్రభుత్వం అండగా ఉంటుందనే మాటలు చెప్పి గద్దెనెక్కిన ప్రభుత్వం చెప్పిందంతా బూటకమేననితేలిపోయిందని పూసపాటిరేగ ఎంపిపి మహంతి కల్యాణి అన్నారు. ప్రజాశక్తి వార్షికోత్సవం సందర్భంగా ఆమె మాట్లాడారు. విశేషాలు ఆమె మాటల్లోనే..

'ప్రజలకు అనుకూల పాలన అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైంది. ప్రజల సంక్షేమం కోసం ఎన్నో వాగ్దానాలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం, ఆ హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైంది. పేదలకు, బడుగుబలహీన వర్గాలకు, రైతులకు, మహిళలకు, విద్యార్థులకుతోపాటు అన్నివర్గాల ప్రజలకు సమానంగా చేరాల్సిన పథకాలు అరకొరగా అందడంతో సంబంధిత వర్గాలు ఆందోళన చెందుతున్నారు. నిజమైన అర్హులు ప్రభుత్వ నిర్లక్ష్యానికి బలవుతున్నారు. తల్లికి వందనం ఇస్తామనిచెప్పి అనేక మంది తల్లులకు వందనం పాడేశారు. ప్రభత్వం వచ్చి ఏడాది గడుస్తున్నా కనీసం పింఛన్లు ఇవ్వలేకపోయారు. జగనన్న ఇచ్చిన పింఛన్లు తీసేసేందుకు కుట్ర చేస్తున్నారు. ఇదేనా మీ పాలనా, సంక్షేమం? ఎరువులు లేక రైతులు మొర్రోమంటూ ఏడుస్తున్నారు. కనీసం అన్నం పెట్టే రైతును పట్టించుకోలేని ప్రభుత్వం ఇది. అరకొరగా అన్నదాత సుఖీభవ నిధులు ఇచ్చి, అరకొర ఎరువులుతో సాగించేయాలను కుంటున్నారు. ఆడపిల్ల నిధిఇ ఏదీ అంటూ ప్రజలు నాయకులును నిలదీస్తున్నారు. ప్రజల సమస్యలను పట్టించుకోకుండా, కేవలం అధికారంలో నిలబడేందుకు ప్రయత్నిస్తున్న కూటమి ప్రభుత్వంపై గ్రామీణ స్థాయిలో ఆగ్రహం పెరుగుతోంది. రైతులు ఇన్‌పుట్ సబ్సిడీలు, విద్యార్థులు ఫీజురీయింబర్స్‌మెంట్, మహిళలు సబ్సిడీ పథకాలు ఇవన్నీ ఆలస్యం అవుతుండటంతో, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అండగా నిలిచేది వైసిపియే. ప్రజా సమస్యలపై మేము ప్రజల కోసం నిరంతరం పోరాడుతూనే ఉంటాం. కూటమి చేస్తున్న అన్యాయంపై ప్రజలు త్వరలోనే గట్టి తీర్పు ఇస్తారు.

ప్రభుత్వాలు, పాలకులు మారినా గంగపుత్రుల బతుకులు మాత్రం మారడం లేదు. సముద్రమే ఆధారంగా బతుకుతున్న మత్స్యకారులకు జీవనోపాధి కరువవుతోంది. ప్రాణాలను ఫణంగా పెట్టి వేటకు వెళ్లినా అందుకు తగ్గ ప్రతిఫలం దక్కడం లేదు. జిల్లాలోని భోగాపురం, పూసపాటిరేగ మండలాల్లో 27 కిలోమీటర్ల మేర విస్తరించి తీరం ఉంది. ఈ తీరం వెంబడి 19 మత్సకార గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో సుమారు 25 వేల మంది జనాభా నివసిస్తున్నారు. వీరిలో సుమారు 10 వేల మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా వేటపై ఆధారపడి జీవిస్తున్నారు.

– ప్రజాశక్తి, పూసపాటిరేగ



సముద్రంలో వేటకెళ్లి తిరిగొస్తున్న మత్స్యకారులు

కష్టాల కడలిలో మత్స్యకారులు

చింతపల్లిలో ఫ్లోటింగ్ జెట్టి నిర్మాణ పనులు ప్రారంభించాలి. దీంతో మత్స్యకారుల సమస్యలు సగం తీరినట్లు అవుతుంది. వలసలు నివారణ జరుగుతుంది. తరచూ సముద్రంలో వేటకు వెళ్లే ముందు జరిగే ప్రమాదాలను నివారించవచ్చు. సముద్రం ఆటు పోట్లకు మత్స్యకారులు దొరకకుండా సురక్షితంగా తమ ఆస్తులను కాపాడుకోవచ్చు. ఫ్లోటింగ్ జెట్టి నిర్మాణం పై ప్రత్యేక దృష్టి పెడితే మత్స్యకారులకు మంచి రోజులు వచ్చినట్లే

చేపల గుర్తింపు కేంద్రాన్ని ఏర్పాటుచేయాలి

ఒకప్పుడు వేటకు వెళ్తే వలలు పిగిలేటంత మత్స్య సంపద దొరికేది. కానీ ప్రస్తుతం తీరంలో ఉన్న రసాయనిక పరిశ్రమల వ్యర్థాలతో చేపల వేట కష్టంగా మారింది. పొద్దస్తమానం వేటాడినా పూట గడవడం కష్టంగా మారింది.

ప్లాట్‌ఫాం వెంటనే అందుబాటులోకి తేవాలి..

కష్టపడి వేటాడి తెచ్చుకున్న మత్స్య సంపద ఆరబెట్టుకోవడానికి ప్లాట్‌ఫాం లేక తీరంలో ఇసుకలో ఆరబెడు తున్నారు. దాంతో చేపలకు ఇసుక అంటుకుని నాణ్యత కోల్పోతున్నాయి. నెత్తళ్లు, రొయ్యలు లాంటి విలువైన మత్స్య సంపద ఆరబెట్టుకోవడానికి ప్లాట్‌ఫాం లేక తడిగానే దళారులకు తక్కువ ధరకు అమ్మి నష్టపోతున్నారు. తీర గ్రామాల్లో వెంటనే ప్లాట్‌ఫాం ఏర్పాటుచేసి మత్స్యకారులను నష్టాల బారి నుండి ఆదుకోవాల్సిఉంది.

దళారులతో తీవ్ర నష్టం

ప్రాణాలకు తెగించి వేటాడి తెచ్చిన వేలాది రూపాయలు మత్స్య సంపద దళారులు పాలవుతుంది. మార్కెట్లో కిలో రూ.200 ఉన్న చేపలు దళారులకు రూ.150కి ఇవ్వాల్సిందే. ఎందుకుంటే దళారులు, మత్స్యకారులకు వేటలేని సమయంలో రూ.10 వేలు నుండి రూ. 20 వేలు దాకా అప్పుగా ఇస్తారు. దానికి బదులుగా వేటాడి తెచ్చిన సరుకును వారికే ఇవ్వాలనే నిబంధన పెడతారు. లేక పోతే కుల కట్టుబాట్ల ప్రకారం జరిమానా విదిస్తారు. దాంతో విలువైన సంపదను తక్కువ ధరకు ఇచ్చి నష్టపోతున్నారు.

ఐస్ పెట్టెలు పంపిణీ చేయాలి

వేటాడి తెచ్చిన మత్స్య సంపదను నిల్వ ఉంచేందుకు ఐస్ బాక్సులు లేకపోవడంతో చేపలు నాణ్యత కోల్పోతున్నాయి. ఐస్ బాక్సులు ఉంటే చేపలు కొన్ని రోజుల వరకూ పాడవకుండా ఉంటాయి. మత్స్య శాఖ పంపిణీ చేస్తున్న ఐస్ బాక్సులు నాణ్యత లేకపోవడంతో (మిగతా..6లో)

కష్టాల కడలిలో మత్స్యకారులు

(5వ పేజీ తరువాయి)

చేపలు పాడైపోతున్నాయని మత్స్యకారులు వాపోతున్నారు. వారికి నాణ్యతగల ఐస్ బాక్స్‌లు పంపిణీ చేయాల్సిఉంది.

తుపాను షెల్టర్లు వినియోగంలోకి తేవాలి

ప్రకృతి విపత్తులు సంభవించి నప్పుడు మత్స్యకారులను సురక్షితంగా ఉంచాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం తీర ప్రాంత గ్రామాల్లో తుపాను భవనాల నిర్మాణం చేపట్టింది. రెండు మండలాల్లో సుమారుగా 24 తుపాను భవనాలను నిర్మించారు. కొన్నేళ్లగా పరిరక్షణ లేక కొన్ని శిథిలావస్థలో కొట్టుమిట్టాడగా మరికొన్ని నేలమట్ట మయ్యాయి. అధికారులు స్పందించి తుపాను భవనాలను వినియోగంలోకి తేవాలి.



వలను సిద్ధం చేస్తున్న మత్స్యకారుడు

మత్స్యకార సొసైటీలను పునరుద్ధరించాలి

నిర్వీర్యమైపోయిన మత్స్యకార సొసైటీలను ప్రభుత్వం పునరిద్ధరించాల్సి ఉంది. గతంలో రెండు మండలాల్లో సుమారుగా 7 మత్స్యకార సొసైటీలు ఉండేవి. ప్రస్తుతం అవి మరుగున పడిపోయాయి. మత్స్యశాఖాధికారులు కూడా వాటి పునరుద్ధరణకు చర్యలు తీసుకోపోవడంతో సొసైటీల ద్వారా గంగపుత్రులకు రావాల్సిన రుణాలు రావడం లేదు. ఆ శాఖ అధికారులు స్పందించి సొసైటీలను పునరుద్ధరించాలి.

తాగునీరు పారిశుధ్యంపై దృష్టి పెట్టాలి

మత్స్యకార గ్రామాల్లో ముఖ్యంగా తాగునీరు, పారిశుధ్యంపై దృష్టి పెట్టాల్సి ఉంది. చింతపల్లి, పెద్దూరు, కొత్తూరు, కోనాడ, తిప్పలవలస, ముక్కాం, కొండరాజపాలెం తదితర గ్రామాల్లో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకులకు అరకొర నీరు రావడంతో తాగునీటికి చేతిబోర్లపై ఆధారపడాల్సిన పరిస్థితి. క్లోరినేషన్ లేక తాగునీరు కలుషితం కావడంతో తరచూ మత్స్యకారులు రోగాలు బారిన పడుతున్నారు. గ్రామాల్లో తాగునీటిపై ప్రత్యేక శ్రద్ధ వహించి పారిశుధ్యం మెరుగు పర్చాల్సిఉంది.

రసాయనిక వ్యర్థాలను నివారించాలి

పదేళ్లగా తీరం వెంబడి పదుల సంఖ్యలో మైలాన్, హెచ్‌బిఎల్, వేదా, అరబిందో, రెడ్డీస్, ఎఐఎల్, సరాకా తదితర రసాయనిక పరిశ్రమలు వెలిశాయి. వీటి నుండి వస్తున్న వ్యర్థ జలాలన్నీ సముద్రంలోకి పైపు లైన్ల ద్వారా విడుదల చేస్తున్నారు. దాంతో ఈ తీరమంతా వ్యర్థ జలాలతో కాలుష్యమైపోయింది. సుమారుగా తీరానికి 5 కిలోమీటర్లు సముద్రం లోపల వరకూ చేపలు జాడ కానరావడం లేదు. దాంతో వేటకు వెళ్లినప్పటికీ చేపలు వలల్లో పడడం లేదు. అది రానురానూ తీవ్రంగా పరిగణించింది. ప్రస్తుతం సాంప్రదాయంగా వస్తున్న కుల వృత్తిని వదల్లేక, భార్యా, పిల్లలను పోషించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

తీరంలో డీజిల్ బంక్ ఏర్పాటుచేయాలి

భోగాపురం, పూసపాటిరేగ మండలాల్లో సుమారుగా 442 మర బోట్లు ఉన్నాయి. ఒకొక్కరూ రోజుకు సుమారుగా 10 నుండి 20 లీటర్ల వరకూ డీజిల్ వినియోగిస్తారు. వేట నిమిత్తం వీరంతా రోజుకు సుమారుగా 3 వేల లీటర్లు డీజిల్‌ను వినియోగిస్తారు. తీరంలో డీజిల్ బంకు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఆటోలపై 15 కిలోమీటర్లు దూరంలో ఉన్న బంకులకు వెళ్లి ప్రతిరోజు డీజిల్ తెచ్చుకుంటారు. కొంతమంది గ్రామంలో అమ్ముతున్న కల్తీ డీజిల్‌ను కొనుక్కుంటున్నారు. దాంతో ఇంజన్లు తరుచూ మరమ్మతులకు గురవుతున్నాయి. దళారుల దగ్గర డీజిల్ కొనడంతో బిల్లులు లేక సబ్సిడీకి కూడా దూరమవుతున్నారు. అధికారులు స్పందించి తీరంలో డీజిల్ బంకు ఏర్పాటు చేయాల్సి ఉంది.

నియోజకవర్గానికి పూర్వ వైభవం



మన నియోజకవర్గానికి మళ్లీ పూర్వ వైభవం వచ్చింది. కూటమి ప్రభుత్వంలో చెప్పిన ప్రతి పథకం ఇస్తుండడంతో ప్రజలు సంతోషంగా ఉన్నారు. ఈ ప్రభుత్వం ద్వారానే అభివృద్ధి, సంక్షేమం జరుగుతాయి. అభివృద్ధి సంక్షేమం రెండూ రెండు కళ్లుగా ఉంటాయి. అన్న ఎన్‌టిఆర్ సమయం నుండి ఈ పార్టీకి మన ప్రాంతంలో అపూర్వ వైభవం ఉంది. దాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మరింత పటిష్టం చేశారు. మాజీ ఎమ్మెల్యే పతివాడ సారధ్యంలో ఈ ప్రాంతమంతా సస్యశ్యామలంగా ఉండేది. బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ పేరుతో గ్రామాల్లో తిరిగాం. చెప్పిన పథకాలన్నీ ఒక్కొక్కటిగా అందిస్తున్నాం. సంక్షేమంతో పాటు అభివృద్ధి కూడా చేయడం ఈ ప్రభుత్వ విధానం. మన ప్రాంతంలో ఎయిర్‌పోర్ట్ ఈ ప్రాంత రూపురేఖలనే మార్చేయబోతుంది. దశాబ్ధాల నాటి పతివాడ కల అగ్ని మాపక కేంద్రం నిర్మాణం చేయడం సంతోషంగా ఉంది. ఈ ప్రాంతం రైతులకు కావాల్సిన రామతీర్థ సాగర్ పనులు పూర్తి అయితే రైతుకు ఆర్థిక భరోసా దొరుకుతుంది. తోటపల్లి కాలువ నీరు మరికొన్ని ప్రాంతాలకు వెలితే చాలా ఉపయోగంగా ఉంటుంది. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఉచిత బస్సు, గ్యాస్ బండలు లాంటి పథకాలు అందించాం. సూపర్ సిక్స్ సూపర్ హిట్టయ్యింది. మళ్లీ అభివృద్ధి గాడిలో పడుతుంది. ఈ ప్రాంతం గాని, రాష్ట్రం గాని అభివృద్ధి టిడిపితోనే సాధ్యం. విజనరీ లీడర్ చంద్రబాబు. ఆయనకు తోడుగా మిగతా సహచరులు అన్ని విదాలా ముందుకు తీసుకువెళతారు.

- మహంతి శంకర్రావు, టిడిపి మండల అధ్యక్షులు, పూసపాటిరేగ

రైతులకు తీరని ద్రోహం



జెడ్‌పిటిసి సభ్యులు మహంతి సీతాలక్ష్మి

ప్రజాశక్తి-పూసపాటిరేగ

కూటమి ప్రభుత్వం రైతులందరికీ అన్నదాత సుఖీభవ నిధులు ఇవ్వకుండా తీరని ద్రోహం చేసిందని జెడ్‌పిటిసి సభ్యులు మహంతి సీతాలక్ష్మి అన్నారు. ప్రజాశక్తి వార్షికోత్సవం సందర్భంగా ఆమె మాట్లాడారు. విశేషాలు ఆమె మాటల్లోనే..

రైతులకు ఖరీఫ్ సీజన్‌లో అవసరమైన ఎరువులు ఇవ్వడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. అన్నదాత సుఖీభవ నిధులు రైతులందరికీ అందలేదు. నెల్లిమర్ల నియోజకవర్గంలో 6 వేల మంది రైతులు ఉంటే కేవలం 9 వేల మందికి మాత్రమే ఈ నిధులు జమయ్యాయి. మిగతా రైతులకు ఏదో సాకు చూపి మొండిచెయ్యి చూపిస్తున్నారు. ఇదేనే రైతు సంక్షేమం అంటే? సూపర్ సిక్స్ అంటూ ప్రచారం ఊదరగొట్టడమే తప్పా అంతా అరకొరే. తల్లికి వందనం పేరుతో ఎంతో మంది తల్లులను మోసం చేసారు. సాంకేతిక సమస్య పేరుతో ఆ పథకానికి ఎంతో మంది తల్లులును దూరం చేసారు. ఇలాంటి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారు. భర్త చనిపోయిన మహిళలకు పింఛను ఇవ్వలేని దుస్థితిలో ఈ ప్రభుత్వం ఉంది. జగనన్న ఇచ్చిన పింఛన్లను తీసేసే పనిలో ఉన్నారు. ప్రజా సంక్షేమం పేరుతో ప్రజా వంచన జరుగుతోంది. గద్దెనెక్కడమే లక్ష్యంగా హామీలు ఇచ్చారు. నమ్మి మోసపోయారన్న సంగతి ప్రజలు గ్రహిస్తున్నారు.

ఇది ప్రజా వంచన



ప్రజాశక్తి- పూసపాటిరేగ

అనతి కాలంలోనే కూటమి ప్రభుత్వానికి, జగనన్న ప్రభుత్వానికి ఉన్న తేడాను ప్రజలు గమనించారు. అందుకే గ్రామాల్లో ఇదేమి ప్రభుత్వం అంటూ ఎద్దేవా చేస్తున్నారు. ఈ రోజున ఎక్కడ చూసినా సంక్షేమం లేక ప్రజలు ఆవేదన చెందుతున్నారు. విద్యార్థులు, మహిళల ఆవేదన వర్ణణాతీతం. వితంతువులకు కనీసం పింఛన్ ఇవ్వకపోవడం సిగ్గు సిగ్గు. కూటిమి నాయకులు ప్రజల్లో తిరగలేకపోవడం మనం గమనిస్తున్నాం. స్థానిక సంస్థల ఎన్నికలంటే కూటమి నాయకులు భయాందోళ చెందుతున్నారు. ఎందు కంటే ఎక్కడకి వెల్లినా ప్రభుత్వం ఇస్తామన్న సంక్షేమం ఏదీ అన్న ప్రశ్నలు ఎదురవుతున్నాయి. అందుకే ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని చెప్పక తప్పదు. ఈ రాష్ట్రంలో మరలా జగనన్న ప్రభుత్వం వస్తేనే అభివృద్ధి , సంక్షేమం సాధ్యం. రైతులు సమస్యలు చెప్పనవసరం లేదు. యువతకు ఏదీ కూటమి భరోసా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఆడబిడ్డ నిధి ఎలాగు రాదని ప్రజలకు అర్థమైంది. 50 సంవత్సరాలకు పింఛన్ వస్తుందని ఆశ ఎలాగులేదు. మోస పూరిత హామీలు ఇచ్చి గద్దెనెక్కేసారు. ఇది ప్రజా వంచన. ఈ ప్రభత్వానికి బుద్ధి చెప్పే రోజులు వచ్చేసాయి.

- అల్లాడ సత్యనారాయణమూర్తి, వైస్ ఎంపిపి, పూసపాటిరేగ



కుమిలిలోని పురాతన ఆలయం

నాటి కుంబిలాపురమే నేటి కుమిలి

ఎటు చూసినా కోట... చుట్టూ మోహరించిన సైనికులు...అడుగడుగునా యుద్ధ వీరుల విన్యాసాలు...ఓ పక్క నుండి గుర్రపు డెక్కల చప్పళ్లతో పరుగులు తీసే రధాలు...మరోపక్క నుండి గజరాజుల ఘీంకారాలు...ఇవన్నీ బాహుబలి సినిమాలో రాజమౌళి చూపించిన సీన్లు అనుకుంటే పొరపాటే. మండలంలోని కుమిలి గ్రామంలో పూర్వం జరిగిన యదార్థ గాథ. విజయనగర మహారాజుల సామ్రాజ్యం ఇక్కడ నుండే ప్రారంభమైంది. కుమిలి గ్రామాన్ని రాజధానిగా చేసుకొని ఇక్కడ నుండే పరిపాలన జరిగిందనడానికి సాక్ష్యాలు ఇక్కడ ఇంకా సజీవంగానే ఉన్నాయి. ఈ ప్రాంతంలో మహారాజులు నిర్మించిన మట్టి కోట శిథిలమై మొండి గోడలు దర్శనమిస్తున్నాయి. నేడు కుమిలిగా నామకరణంతో పిలువబడుతున్న ఈ గ్రామం ఒకప్పుడు కుంబిలాపురం అనే నామకరణంతో విరజిల్లేది. కాలక్రమేన ఈ కుంబిలాపురంలో మట్టి కోట కుమిలిపోవడంతో ఈ గ్రామానికి కుమిలి అనే పేరు వచ్చింది. అప్పటి నుండి కుంబిలాపురానికి బదులుగా కుమిలి అనే పేరు మిగిలిపోయింది.

ప్రజాశక్తి-పూసపాటిరేగ

నేడు కుమిలిగా పిలువబడుతున్న ఈ గ్రామం ఒకప్పుడు కుంబిలాపురంగా వెలుగొందింది. మన విజయనగర గజపతుల పూర్వీకుల నివాసానికి ఆశ్రయమైంది. ఈ గ్రామంలో ఉత్తరాన ఉన్న పెద్ద చెరువు సమీపంలో విజయనగరం గజపతుల పూర్వీకులైన పెదజగన్నాధరాజు తనయుడు కృష్ణమరాజు పరిపాలనా సౌలభ్యం కోసం కుమిలిలో మట్టి కోటను నిర్మాణం చేయించినట్లు చరిత్ర చెబుతుంది.

కళింగ రాజ్యంలో అంతర్భాగంగా ఉండే కుమిలి కోటనే రాజధానిగా చేసుకొని ప్రజాపరిపాలనా కార్యకలాపాలు సాగించేవారు. ఈ కుంబిలాపురం సాంస్కృతిక, సాహిత్య, కళారంగాలకు వేదికగా బాసిల్లింది. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిందనడానికి కారణం ఈ గ్రామంలో ఉన్న మసీదులే. మహారాజులు పాలనలో ఈ ప్రాంతంలో ముస్లిములు అధిక సంఖ్యలో ఉండేవారని ఇక్కడ వృద్ధులు చెబుతున్నారు. ఈ కుంబిలాపురంలో ముస్లిమ్‌ల కోసం ఉర్దూ పాఠశాల ఉండేదంటే మహారాజుల పాలనలో మత సామరస్యానికి ఇచ్చిన ప్రాధాన్యతేంటో మనకు అర్థమవుతుంది. విజయనగర గజపతులు మత సామరస్యాన్ని ఇప్పటికి కొనసాగిస్తున్నారంటే అది వారి పూర్వీకుల నుండి పునికి పుచ్చుకున్నదనే తెలుస్తుంది. ఇంత చరిత్ర ఉన్న ఈ కుమిలి గ్రామం జిల్లాలో చారిత్రక ప్రాధాన్యత గల గ్రామాల్లో ముందు వరసలో ఉంచాల్సిందే. ఈ ప్రాంతంలో ప్రజలంతా కుమిలి సంస్థానీసులకు కప్పం చెల్లించేవారు. కొంతకాలం తరువాత అన్నమరాజుకు పసుపు కుంకమ క్రింద ఈ గ్రామాన్ని మహారాజు ఇచ్చివేసినట్లు చరిత్ర పుటలు చెబుతున్నాయి. అన్నమరాజు వంశానికి సంబంధించిన ఆనందరాజు కుమిలి ప్రభువుగా నియమితులయ్యారు. ఆయన గొప్ప యుద్ధ వీరునిగా వెలుగొందినట్లు తెలుస్తుంది. ఈయన బహుల సైన్యాన్ని సమకూర్చుకొని రాజ్య విస్తరణకు పూనుకున్నాడు. 1712లో పది వేల మంది సైనికులతో శ్రీకాకుళం మహమ్మదీయులు సైన్యాన్ని ఓడించి శత్రు గ్రామాలను వసపరుచుకున్నాడు. 1713లో గాజులరేగ సమీపంలో విజయపురి అనే గ్రామాన్ని నిర్మించారు. అక్కడ రాతి కోట (మిగతా.. 8లో)

కూటమి అసమర్ధ పాలన

వైసిపి మండల అధ్యక్షులు పతివాడ అప్పలనాయుడు

ప్రజాశక్తి-పూసపాటిరేగ



అర్హులందరికీ సంక్షేమ పథకాలు ఇవ్వలేని కూటమి ప్రభుత్వానిది ఒక అసమర్ధ పాలన అని వైసిపి మండల అధ్యక్షులు పతివాడ అప్పలనాయుడు విమర్శించారు. ప్రజాశక్తి వార్షికోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడారు. విశేషాలు ఆయన మాటల్లోనే..

40 ఏళ్ల అనుభవం అంటూ ప్రచారం చేసుకుంటూ పాలన గాడికి వదిలేయడం కూటమి ప్రభుత్వంలో చూస్తున్నాం. గ్రామాల్లో ప్రజలు సంక్షేమ పథకాలు అందక అల్లాడుతున్నారు. ఏ పథకం అమలు చేసినా అందుతుందో లేదోనని ప్రజల్లో ఆందోళన మొదలవుతోంది. ఎక్కడ మమ్మల్ని సాంకేతిక సమస్యతో పక్కన పెట్టేస్తారోనని ఆవేదనలో ఉన్నారు. ప్రతి పథకానికి సాంకేతిక పేరు చెప్పి అర్హులకు మొండి చెయ్యి చూపిస్తున్నారు. సంపద సృష్టిస్తామని చెప్పి ప్రజలను మోసం చేసి గద్దెనెక్కారు. సూపర్ సిక్స్ అమలులో చతికిల బడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్త పింఛన్లు ఇవ్వకపోగా కొత్త పింఛన్లను తొలగించేందుకు ప్రయత్నం చేస్తున్నారు. వికాలంగులపై మీ ప్రతాపం ప్రజలంతా చూస్తున్నారు. వైసిపి పోరాటం చేస్తేనే ఏదో ఒక పథకం అమలు చేస్తున్నారు. చేసింది కూడా తూతూ మంత్రంగా అరకొరే ఇస్తున్నారు. ఇది ప్రజలను మోసం చేయడం కాదా?. సంక్షేమాన్ని విస్మరించి కుంటు సాకులతో కాలయాపన చేస్తున్నారు. ఈ ఏడాదిలో నియోజకవర్గంలో మత్స్యకారులకు ఏమైనా ఉపయోగ పడే కార్యక్రమాలు చేపట్టారా? కనీసం తాగునీరైనా సక్రమంగా ఇవ్వగలుగుతున్నారా ? రైతులకు యూరియా ఇవ్వలేని ప్రభుత్వాన్ని ఏనాడూ చూడలేదు. ప్రజలే తగిన బుద్ధి చెబుతారు.

నాటి కుంబిలాపురమే నేటి కుమిలి


కుమిలి గ్రామం


(7వ పేజీ తరువాయి)

నిర్మాణం చేపట్టాడు. కోట నిర్మాణం పూర్తి కాకముందే 1717లో ఆయన మృతిచెందాడు. ఆనందరాజు కుమారుడు పెదవిజయరామ రాజు కుంబిలా పురం (కుమిలి) నుండి రాజధానిని విజయపురికి మార్చాడు. అక్కడ నుండే పాలన సాగించారు. కాలక్రమేన విజయపురి విజయనగరంగా మారింది.

కాలక్రమంలో రాజులు పోయారు...రాజ్యాలు పోయాయి...కానీ వారు నడయాడిన నేలతో పాటు వారు నిర్మించిన కోటలు, పూలతోటలు, మసీదులు అక్కడక్కడా దర్శనమిస్తున్నాయి. విజయనగర సామ్రాజ్య వైభవం ఇక్కడ నుండే ప్రారంభమైందని కుమిలి ప్రజలు గొప్పగా చెప్పుకుని ఆనందం వ్యక్తంచేస్తుంటారు. మిగిలిపోయిన మట్టి కోట ఆనవాళ్లను చూపిస్తూ పూర్వ వైభవం గురించి కుమిలి గ్రామస్తులు గర్వంగా చెబుతారు. తాము ఈ చారిత్రక ప్రాధాన్యత గల గ్రామంలో ఉన్నందుకు సంతోషిస్తున్నామని పిన్నలు, పెద్దలు చెబుతుంటారు. మహారాణుల కోసం ఇక్కడ వేసిన పూల తోటలు నేడు కుమిలి గ్రామస్తులకు జీవనాధారంగా మారిందని అంటున్నారు.

పూర్వీకుల కథనం...

క్రీ.శ. 13వ శతాబ్దం నుండి 17వ శతాబ్దం వరకూ కుంబిలాపురంలో పాలన జరిగేదట. ఇక్కడ సుమారుగా 30 ఎకరాల స్థలంలో మట్టి కోట నిర్మాణం చేశారని చెబుతున్నారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో మట్టి కోట కుమిలిపోవడంతో మట్టి దిబ్బలు ఉన్నాయి. మట్టి కోట శిథిలమైపోతున్న సమయంలో రాజు రాజ్య విస్తరణలో భాగంగా కోట మరో ప్రాంతంలో కట్టాలని నిర్ణయించారని కథనం. వీర గడ్డ కోసం వెతుకులాట ప్రారంభమైందట. ఒక రోజున రాజు వేట నిమిత్తం ప్రస్తుతం విజయనగరంలో ఉన్న కోట వైపు కుమిలి కోట నుండి బయలుదేరారు. రాజు గుర్రంపై వెళ్తూ తన వద్ద ఉన్న కుక్కలను ముందుగా వదిలారట.


గతంలో కోట ఉండే స్థలం ఇదే

విజయనగరం సమీపంలో కుక్కల ముందు చెమరపిల్లి పరుగులు పెట్టిందట. ప్రస్తుతం విజయనగరం కోట ఉన్న స్థలంలోకి రాగానే వేట కుక్కలపై చెమలపిల్లి తిరగబడిందట. దాంతో రాజు ఆ దృశ్యాన్ని చూసి ఈ స్థలం వీరగెడ్డని గుర్తిం చారట. అందుకే రాతి కోటను అక్కడ నిర్మిం చారట. అప్పటికే కుమిలిలో మట్టితో నిర్మాణం చేసిన కోట కుమిలిపోయే స్దితిలో ఉండడంతో రాతి కోట నిర్మాణం పూర్తయిన వెంటనే కుమిలి నుండి విజయనగరానికి మకాం మార్చారని కతనం ఈ ప్రాంతంలో ఉంది.

ఒకే రకమైన సాదృశ్యం

కుమిలి, విజయనగరానికి నాటికి, నేటికి ఒకే రకమైన సాదృశ్యాలు కనబడతాయి. కుమిలి మట్టి కోట చుట్టూ శత్రువులు కోటలోకి ప్రవేశించకుండా కందకం తవ్వి ఉంది. ప్రస్తుతం విజయనగరం కోట చుట్టూ శత్రువులు కోటను తాకకుండా కందకం తవ్వి ఉంది. కుమిలిలో ఉన్న పెద్ద చెరువు తూర్పు బాగాన మట్టి కోట ఉంది. విజయనగరంలో కూడా పెద్ద చెరువుకు తూర్పు బాగాన కోట నిర్మాణం చేశారు. కుమిలి కోటకు ముందు బాగాన మెట్టపై మసీదు నిర్మించారు. విజయనగరం కోట మందు దర్గా ఉంది. కుమిలిలో ఎన్ని వీదులు పేర్లు ఉన్నాయో విజయనగరంలో కూడా అన్ని వీధులు పేర్లు ఉన్నాయి.

ఊరు పేరు మార్పు కోసం కృషి

మా గ్రామం చారిత్రక ప్రాధాన్యత కలిగి ఉండడం చాలా ఆనందమని గ్రామస్తులు చెబుతున్నారు. మేము ఉన్న ఈ స్దలం ఒకప్పుడు వీరగడ్డని తెలియడంతో మాకు సంతోషంగా ఉంటుందన్నారు.కుంబిలాపురంగా వెలుగొందిన ఈ గ్రామానికి మళ్లీ అదే పేరు పెట్టేలా గ్రామస్తులమంతా కృషి చేయడానికి సిద్ధమవుతున్నామన్నారు. కోట కుమిలి పోవడంతో కుమిలిగా పేరు వచ్చిందని తెలిపారు. ప్రస్తుతం పురాతన దేవాలయం మా గ్రామంలో ఉంది. మా గ్రామాన్ని ప్రస్తుతం ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు.

కాలగర్భంలో కోట భోగాపురం

ప్రజాశక్తి - పూసపాటిరేగ

ఒకప్పుడు రాజులు ఏలిన ఊరు.. మహారాణులు నడయాడిన నేల.. రాచరిక వైభోగాలతో విరాజిల్లిన గ్రామం.. కాలంతో పరిగెత్తలేక కాలగర్భంలో కలిసిపోయింది.. చరిత్ర పుటలకు అందని దూరంలో మునిగిపోయింది.. చంపావతి నదీ తీరాన కొలువైన మట్టి కోట వరదల్లో శిథిలమైంది.. అక్కడ పాలించిన రాజవంశాలు తరలిపోయాయి. శతాబ్ధాల చరిత్ర శిథిల సాక్షాలు ఇంకా సజీవంగానే దర్శనమిస్తున్నాయి.. నేటికీ ఈ గ్రామం రెవన్యూలో 200 ఎకరాల భూమి ఉంది.. కాలక్రమేణా ఊరంతా తరలిపోయినా పేరు మాత్రం ఇంకా మిగిలే ఉంది.. అదే కోట భోగాపురం..

జాతీయ రహదారిని ఆనుకొని పూసపాటిరేగ, డెంకాడ, భోగాపురం సరిహద్దులుగా చంపావతి నదీ తీరాన కోట భోగాపురం ఉంది. ఇక్కడ విజయనగర పాలకుల పూర్వీకులు తమ్మిరాజ్‌దేవ్ అనే మహరాజు పాలించినట్లు చరిత్ర చెబుతోంది. కోట లోపల నేలమాలిగలు, నీటి కొలనులు, చుట్టూ పూలతోటలతో గుర్రాలు, పశువులు అధిక సంఖ్యలో కొలువు దీరిన కోట ఇది. శతాబ్ధాల క్రితం చంపావతిలో వచ్చిన భారీ వరదల తాకిడికి ఈ కోట శిథిలమైపోయిందని చెబుతుంటారు. దీంతో తమ్మిరాజ్ దేవ్ ఇక్కడ నుంచి కుమిలి కోటకు తరలిపోయారంటారు. ప్రస్తుతం భోగాపురం మండలంలోని నందిగాం పంచాయితీ పరిధిలో ఉన్న ఈ గ్రామంతా ప్రస్తుతం మట్టి పోగులతో దర్శనమిస్తుంటుంది. ఆ దిబ్బలపై నీలగిరి, సరుగుడుతోపాటు డొంకలతో అడవిని తలపిస్తున్న వృక్షాలతో నిండిపోయి ఉంది.

పేరే తప్ప ఊరు లేదు

పేరు గొప్ప ఊరు దిబ్బ అనే నానుడు ఈ గ్రామానికి సరిగా సరిపోతుందని చెప్పాలి. ఒకప్పుడు గొప్పగా వెలుగొందిన ఈ కోట నేడు మట్టి దిబ్బగా మారిపోయింది. ఈ గ్రామానికి పేరే తప్ప ఒక్క కుటుంబం కూడా నివాసం ఉండడంలేదు. కాలక్రమేనా కోటకు చెందిన భూములన్నీ సమీపంలో ఉన్న కొప్పెర్ల, నడిపల్లి, నాతవలస, సింగవరం గ్రామస్తుల వశమయ్యాయి. ప్రస్తుతం అందులో భూములన్నీ రైతులు పేరిట జిరాయితీలుగా మారిపోయాయి.

సజీవంగా ఉన్న జాడలు

అక్కడ కోట శిథిలమై శతాబ్ధాల క్రితమే రాజులు తరలిపోయారు. ఆనాటి కోటంతా నేలమట్టమైంది. ఆ ప్రాంతమంతా మట్టి దిబ్బలుగా పేరుకుపోయింది. కోట సమీపంలో తాగునీటికి ఏర్పాటు చేసికొన్న నీటి కొలనులు బీడుభూములుగా మారిపోయాయి. గుర్రాల, పశువులకు ఏర్పాటు చేసిన నీళ్ల కుండీలు జాడలు నేటికీ కనిపిస్తుంటాయి. అప్పటి రాతి స్తంభా నేటికీ దర్శనమిస్తుంటాయి.

ఔషధ మొక్కలు

శతాబ్ధాల కాలం నుంచి ఇక్కడ భూమి ఖాళీగా ఉండడంతో అడవిని తలపించేలా చెట్లు, డొంకలు పెరిగిపోయాయి. కోట సమీపంలో నుంచి చంపావతి నదిలోకి నీరుపారే పిల్ల కాలువవంతా వృక్షాలతో భయానక ప్రదేశంగా మారిపోయింది. ఆ ప్రాంతంలో వన మూలికలను ఇచ్చే వృక్షాలు అధిక సంఖ్యలో ఉన్నాయని రైతులు చెబుతుంటారు. అందువల్లే విష సర్పాలు సైతం ఈ ప్రాంతలో పడగ విప్పవని నమ్ముతుంటారు. ఇక్కడున్న కాలువలో పారే నీరు తాగితే జబ్బులు నయమవుతాయని చెబుతుంటారు.

కోట సామాలమ్మ కాపలా

మహరాజుల పాలించే కాలం నుంచి అక్కడ సామాలమ్మ అనే దేవత ఆ ప్రాంతాన్ని సంరక్షిస్తున్నట్లు అక్కడ రైతుల నమ్మకం. కోట ప్రాంతంలో రోజూ అర్ధరాత్రి ఒక ఎన్నుపోతు తిరుగుతుంటుంది. దాని వెనుక సామాలమ్మ దేవత మువ్వల శబ్ధంతో పహరా కాస్తుందని చెప్పుకుంటారు. ఈ ప్రాంత రైతులంతా ఏటా సామాలమ్మకు మొక్కలు తీర్చుకుంటారు. అందుకే ఆమెను కోట సామాలమ్మ అని అంటారు.

తరలిపోయిన భోగాపురం

నదీ తీరంలో ఉన్న కోట భోగాపురంపై ప్రకృతి కోపించడంతో వరదలు ముంచెత్తాయి. దాంతో రాజులు తరలిపోవడంతోపాటు అక్కడ నుంచి గ్రామం కూడా నది తీరానికి దూరంగా వెళ్లి నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. ప్రస్తుతం భోగాపురవాసులంతా అంతా పూర్వం కోట భోగాపురం నుంచి తరలి వెళ్లినవారేనని పూర్వీకులు చెబుతుంటారు.

ఈ ప్రాంతం అభివృద్ధే ధ్యేయం



ఈ ప్రాంతాలు అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుంది. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పనిచేస్తున్నారు. ప్రజా శ్రేయస్సు కోసం ఆహర్నిషలు పనిచేస్తున్నారు. ఆయనకు తగ్గట్టుగానే ఎమ్మెల్యే లోకం నాగమాధవి పనిచేస్తున్నారు. ఈ ప్రాంత ప్రజలు, అభివృద్ధే ధ్యేయమని నిరంతరం తపిస్తున్నారు. కూటమి ప్రభుత్వం రాగానే గుంతలు రోడ్డ పూడ్చి రహదదారి సౌకర్యం కల్పించిన ఘనత ప్రభుత్వానికి దక్కుతుంది. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసి ప్రజల పక్షాన నిలబడ్డారు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, ఉచిత గ్యాస్, ఉచిత బస్సు మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- జలపారి శివ, జనసేన మండల అధ్యక్షులు, పూసపాటిరేగ మండలం

సూపర్ సిక్స్‌లో విఫలం



కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ అమలు చేయడంలో విఫలమైంది. మాది ప్రజా ప్రభుత్వం అని చెప్పుకోవడమే తప్ప పాలనలో ఏమాత్రం ప్రజలు పక్షం లేదు. సూపర్ సిక్స్ పేరు చెప్పి అరకొర సంక్షేమమే అందిస్తున్నారు. గ్రామాల్లో ప్రజలు ఈ ప్రభుత్వం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలు ముందు చెప్పిన సంక్షేమం, అభివృద్ధి కనిపించడం లేదు. ముఖ్యంగా మహిళలు, రైతులు, విద్యార్థులు సంతృప్తిగా లేరు. గత పాలనలో అభివృద్ధి, సంక్షేమంతో గ్రామాలు, ప్రజలు సంతోషంగా ఉండేవారు. సంక్షేమ పథకాలు ఇవ్వడానికి లోటు బడ్జెట్ అని చెబుతున్నారు. మరి ఎలా ఎన్నికలు హమీ ఇచ్చారు. యూరియా లేక రైతులు రోడ్డున పడ్డ పరిస్థితి నెలకొంది. 40 ఏళ్ల అనుభవం ఏమైంది? ఇదేనా మీ 40 ఏళ్ల అనుభవం? మళ్లీ వైసిపితోనే అన్ని వర్గాలూ అభివృద్ధి, సంక్షేమంతో సంతోషంగా ఉంటాయి.

- ఎం.సత్యనారాయణరాజు, వైస్ ఎంపిపి, పూసపాటిరేగ

చింతపల్లి తీరం పగడాల హారం

మూడు కిలోమీటర్ల మేర ఏర్పడిన సహజ సంపద



చింతపల్లి తీరంలో తాజాగా శాస్త్రవేత్తలు గుర్తించిన అరుదైన పగడాల దిబ్బలు చక్కని సహజ సంపదకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. సముద్ర గర్భంలో అరుదైన ప్రక్రియల వల్ల ఏర్పడే ఈ పగడాలు దిబ్బలు భారత తీర రేఖలో అరుదుగా కనిపిస్తాయి. చింతపల్లి తీరంలో విస్తరించి ఉన్న ఇవి దాదాపు 3 కిలోమీటర్ల మేర 12 దిబ్బలు పరిశోధనల ద్వారా వెలుగుచూశాయి. ఇంత విలువైన సహజ సంపదకు చింతపల్లి సముద్రం వేదిక కావడంతోపాటు ఇక్కడి సాగర గర్భంలోని సముద్రపు శిలా పర్వతం, గొల్యాత్ శిథిలాలు.. అన్నీ కలిపి జిల్లాకు అపూర్వమైన సహజ సంపదే. సముద్రపు మణిహారంగానూ మార్చాయి. దాంతో దేశంలోనే అత్యంత ఖరీదైన జల క్రీడ స్కూబా డ్రైవింగ్‌కు ప్రత్యేక ఆకర్షణగా మారింది. చింతపల్లి తీరం ఇప్పుడు కేవలం ఒక సముద్రతీరం మాత్రమే కాదు, ప్రకృతి రత్నబాండాగారమని చెప్పక తప్పదు. ఇది దేశంలోనే ప్రముఖ పర్యాటక కేంద్రంగా ఎదగనుందని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు.

ప్రజాశక్తి - పూసపాటిరేగ

విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలంలోని చింతపల్లి సముద్ర తీరం.. పగడాల దిబ్బల ప్రకృతి అందాలతోపాటు మత్స్యకారులకు వరంగా మారింది. ఈ దిబ్బలు ఏర్పడిన చోట చేపలు ఎక్కువగా దొరుకుతాయని పరిశోధనలు చెబుతున్నాయి. ఈ దిబ్బల్లో అరుదైన చేపలు ఆవాసాలుగా మార్చుకుంటాయి. ఈ తీరంలో పర్వత శిలాతోరణం ఉన్న ప్రాంతంలోనే సుమారు మూడు కిలోమీటర్ల పరిధిలో 12 పగడాల దిబ్బలను గుర్తించినట్లు సముద్ర శాస్త్రవేత్తలు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ పగడాల సముదాయాన్ని 'పగడాల హారం'గా పరిగణిస్తున్నారు. ఇవి సముద్రం లోపల జీవించే చిన్న జీవులైన పాలిప్స్, సజీవ చర్యల వల్ల ఏర్పడిన అద్భుత జీవశిలలు. చింతపల్లి సముద్ర గర్భంలోని ఈ పగడాల హారం, గొల్యాత్ శిథిలాలు, సాగర శిలా పర్వతం పర్యాటక ప్రాంతంతోపాటు మత్స్యకారులుకు వరంగా మారాయి. జీవ వైవిధ్యం ఉట్టిపడే ఈ పగడాల దిబ్బలతో చింతపల్లి తీరం ఇప్పుడు శాస్త్రీయ పరిశోధనలకు కేంద్ర బిందువుగా మారింది.

ఈ ప్రాంతంలో పగడాలు ఎలా ఏర్పడ్డాయి? అక్కడ శిలా తోరణం, శిథిలాల వయస్సు ఉన్న 'గొల్యాత్' అనే ఓడ తాత్కాలిక నిర్మాణమా? శాశ్వత నౌక శిథిలమా? సముద్ర పర్వత భౌగోళికం ఇది టెక్టానిక్ ప్లేట్ క్రియలనాడా లేక శిలా వృద్ధి వల్లా? ఇలా ప్రతీ అంశం పరిశోధకులకు పెద్దప్రశ్నగా మారింది.

పర్యాటక అభివృద్ధి

పగడాల ప్రాంతాన్ని స్నోర్కెలింగ్, స్కూబా డైవింగ్ వంటి సాహస క్రీడలకు అభివృద్ధి చేయవచ్చు. సముద్రంలో శాస్త్రీయ పరిశోధనలకు కేంద్రంగా మారుతుంది. ఇది విశ్వవిద్యాలయాల పరిశోధకుల దృష్టిని ఆకర్షిస్తోంది. తద్వారా చింతపల్లి గ్రామం పర్యావరణ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందే అవకాశముంది. ప్రభుత్వ సహకారం అందితే, స్థానికులకు ఉపాధి, యువతకు శిక్షణ, పర్యావరణ విద్య పెరగొచ్చు. ఇలాంటి సహజ సంపదలపై అవగాహన పెంచడంలో పాఠశాలలు, కాలేజీలకు సహకారం కలగవచ్చు.



చింతపల్లి తీరంలో అరుదైన జలచరం

పగడాలకు రక్షణ అవసరం

ఈ అరుదైన ప్రకృతి సంపద భవిష్యత్తు కోసం రక్షణ అవసరం ఎంతైనా ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. పగడాల పరిరక్షణకు చట్టబద్ధమైన చర్యలు, సామూహిక భాగస్వామ్యం అవసరం. చింతపల్లి సముద్ర పగడాలు నాశనమవ్వకుండా ఉండాలంటే ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్రంలో పడకుండా జాగ్రత్త పడాలి. అసాధారణ మత్స్యవేట నియంత్రణ ఉండాలి.

పగడాల మధ్య 'గొల్యాత్' శిథిలాలు

చింతపల్లి సముద్ర గర్భంలో 'గొల్యాత్' అనే ఓడ శిథిలాలు ఉన్న సంగతి తెలిసిందే. ఇది వందేళ్లకు పైగా సముద్ర గాథకు ఆధారం సూచిస్తుండగా, ఓడ శిథిలాల చుట్టూ పగడాల హారం ఏర్పడినట్లు శాస్త్రవేత్తలు విశ్లేషిస్తున్నారు. తీరం నుండి పది కిలోమీటర్ల దూరంలో సముద్రపు పర్వతం ఉండడంతో సముద్ర తక్కువ లోతులో ఓ శిలా నిర్మాణం ఏర్పడింది. ఈ శిథిలాల వద్ద ఒక పెద్ద సముద్రపు శిలా పర్వతం ఉన్నట్లు గుర్తించారు. ఇది ప్రకృతి స్వభావంగా ఏర్పడిందా? లేక పురాతన మానవ నిర్మిత నిర్మాణం శిథిలమైందా? అనే అంశంపై అధ్యయనం జరుగుతోంది. అయితే ఆ పర్వతంపై గొల్యాత్ నౌక శిథిలాలు, చుట్టూ పగడాల అభివృద్ధి, ఆ ప్రాంతంలో చెప్పగలిగిన జీవవైవిధ్యం ఇవన్నీ కలిపి ఈ ప్రదేశాన్ని విజయనగరం జిల్లా రహస్యమైన అద్భుత గర్భంగా నిలబెడుతున్నాయి.

పర్యాటక స్వర్గధామం

ఈ ప్రాంతాన్ని రెండేళ్ల క్రితం నుండే స్కూబా డ్రైవింగ్‌కు అత్యుత్తమ ప్రదేశంగా ఎంపిక చేశారు. సముద్రపు లోతుల్లో ప్రకృతి కళాఖండాలు, పగడాల రంగులు, జీవాలు, శిథిలాలు ఇవన్నీ చూసేందుకు జల ప్రియులు ఆసక్తి చూపుతున్నారు. రంగురంగుల చేపలు, పగడాల మధ్య కదులుతున్న సముద్ర జంతువులు, శిలాశిల్పంగా ఉన్న శిథిల భాగాలు వీటన్నింటిని చూడాలంటే ఇది సాహస పర్యాటకానికి స్వర్గధామం. స్కూబా డైవింగ్‌కు పర్యాటక ఆకర్షణ. ఇది ఈ ప్రాంతానికి పర్యాటక రంగం ద్వారా ఆదాయ వనరులను తీసుకురావచ్చని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.

తీర రక్షణ కవచం

ఈ సహజ సిద్ధమైన పగడాల హారం తీర రక్షణ కవచంలో ఉపయోగపడుతోంది. ఈ పగడాల గుణాల వల్ల సముద్రపు అలల ప్రభావాన్ని తగ్గించే సహజ రక్షణ గోడగా పనిచేస్తాయి. అరుదైన చేపలకు ఆలవాలంగా మారతాయి. తీరాన్ని రక్షించేందుకు ఉపయోగపడతాయి. పగడాల వల్ల సముద్రపు బయోలాజికల్ డైవర్సిటీ (సజీవ వైవిధ్యం) పెరుగుతుంది.

ఆర్థిక ప్రయోజనాలు

పడగాల దిబ్బలు సముద్ర జీవులకు నివాస ప్రదేశంగా పనిచేస్తాయి. స్థానిక మత్స్యకారులకు ఆదాయ మార్గంగా మారే అవకాశం ఉంది. పగడాల చుట్టూ ఎక్కువగా చేపలు కనిపించే అవకాశముంటుంది. దాంతో మత్స్యకారులకు చేపలు లభ్యమయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఈ పగడాల నిక్షేపాలు స్థానిక మత్స్యకారులకు, స్థానిక వ్యాపార అభివృద్ధికి కొత్త దారి చూపనున్నాయి. ప్రభుత్వం ఈ ప్రకృతి వనరులను సద్వినియోగం చేసుకునేలా పర్యాటక మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తే, ఈ ప్రాంతం ఆర్థిక పరంగా బలపడుతుంది. అంతేకాదు, ఈ పగడాల అధ్యయనం ద్వారా వాతావరణ మార్పులు, సముద్ర జీవ వ్యవస్థ గురించి తెలుసుకునే అవకాశం కూడా ఉంది.



శిథిల నౌక



నెరవేరనున్న దశాబ్దాల కల

శరవేగంగా ఫైర్‌స్టేషన్ పనులు



ఫైర్‌స్టేషన్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి

ప్రజాశక్తి-పూసపాటిరేగ

భోగాపురం, డెంకాడ, పూసపాటిరేగ నడుమ అగ్నిమాపక కేంద్రం నిర్మాణం చేపట్టాలన్నది ఈ ప్రాంత ప్రజల చిరకాల వాంఛ. మాజీ మంత్రి పతివాడ నారాయణస్వామి నాయుడు అసెంబ్లీ ఎన్నికల హామీల్లో ఇదొకటని చెప్పాలి. అయితే ఫైర్‌స్టేషన్ కోసం ఆయన అలుపెరగని పోరాటం చేశారు. కార్యరూపం దాల్చడానికి అనేక అడ్డంకులు వచ్చాయి. అయినా పట్టువదలని విక్రమార్కుడిలా ప్రయత్నం సాగించారు. చివరికి టిడిపి కూటమి ప్రభుత్వంలోనే, జనసేన ఎమ్మెల్యే లోకం నాగమాధవి మరింత గట్టిగా పట్టుబట్టారు. చివరికి ఫైర్‌స్టేషన్ కార్యరూపం దాల్చి పనులు చకచకా సాగుతున్నాయి. దీంతో మూడు దశాబ్దాల నాటి ఈ ప్రాంత ప్రజల కల త్వరలో నెరవేరబోతోంది.

తీరప్రాంత మండలాలైన భోగాపురం, పూసపాటిరేగలో ఎక్కువగా పూరిళ్లు ఉండేవి. అగ్నిమాపక కేంద్రం దగ్గరలో లేక ఎన్నో పూరిళ్లు కాలిబూడిదయ్యాయి. ప్రస్తుతం గ్రామాల్లో పక్కా భవనాలు ఉన్నప్పటికీ అగ్ని మాపక కేంద్రం అవసరం ఎంతో ఉంది. దీంతో అగ్ని మాపక కేంద్రం అవసరమని మాజీమంత్రి పతివాడ నారాయణస్వామి నాయుడు గుర్తించారు. అందుకోసం ఎంతో పోరాటం సాగించారు. ఈ ప్రాంతమంతా పరిశ్రమలతో ఉండడంతో అగ్నిమాపక కేంద్రం అవసరత పెరిగింది. మండలంలోని కోనాడ జంక్షన్ వద్ద జాతీయ రహదారికి సమీపంలో సుమారుగా 2.25 కోట్లు అంచనాతో ఫైర్‌స్టేషన్ నిర్మాణ పనులు ప్రారంభించారు. ప్రస్తుతం పునాదులు పడ్డాయి. మూడు దశాబ్దాల నిరీక్షణకు తెరపడింది. అగ్నిప్రమాద బాధల నుంచి గట్టెక్కుతామన్న సంతోషం ప్రజల్లో ఉంది. ఏదేమైనప్పటికీ ఏళ్ల నాటి కల నిజమవుతోందని నియోజకవర్గంలో పలువురు అంటున్నారు.



సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు



సంక్షేమం, అభివృద్ధి టిడిపికి రెండు కళ్లు లాంటివి. ఒకదాని కోసం ఇంకోటి విస్మరించదు. ఎందకంటే ఆయన విజనరీ లీడర్. భవిష్యత్తును ముందుగానే పసిగట్టగల సమర్థుడైన నాయకుడు చంద్రబాబు. అందుకే ప్రజలు ఇంతగా పట్టం కట్టారు. టిడిపితోనే ఈ రాష్ట్రంగాని, ప్రాంతం గాని అభివృద్ధి చెందుతుందని ప్రజలు నమ్ముతారు. దానికి తగ్గట్టుగానే ప్రజలు తీర్పు ఇచ్చిన సంగతి మనకు తెలిసిందే. ఎన్నికలు ముందు ఏదైతే వాగ్దానం చేసారో ఆ సూపర్ సిక్స్ ఒక్కొక్కటిగా చేసుకుంటూ వస్తున్నారు. ప్రజలందరూ సంక్షేమం పథకాలు అందుకొని సంతోషంగా ఉన్నారు. తల్లికి వందనం పిల్లలందరికీ ఇచ్చే ఘనత ఈ పార్టీకే ఉందని చెప్పాలి. చెప్పిన మాట ప్రకారం పింఛన్‌లు పెంచి ఇస్తున్నారు. కొత్తగా అర్హులైన వారికీ మంజూరు చేస్తున్నారు. సుపరిపాలనకు అర్థం అంటే ఏంటో చూపించారు. గతకలు రోడ్లుకు మోక్షం కలిగించారు. గత ప్రభత్వం చేసిన విచ్ఛిన్నంను సరిదిద్దికుంటూ రాష్ట్రంను గాడిలో పెడుతూ సంక్షేమ పథకాలు అమలు చేయడం చాలెంజ్‌తో కూడినది. అయినా ఇచ్చిన మాట తప్పకుండా సూపర్ సిక్స్‌లో బాగంగా తల్లికి వందనం, గ్యాస్ బండలు, అన్నతాత సుఖీభవ, ఉచిత బస్సు ఇస్తున్నారు. ఇలాంటి ప్రభుత్వానికి మనం సహకారంగా ఉండాలి.

- మహంతి చిన్నంనాయుడు,
టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి